



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 76 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 27 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 76 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 27 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఎర్రకోటపై మువ్వన్నెల రెపరెపలు



వివరాలు 2లో..

### రిపబ్లిక్ డే పరేడ్ దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక

- గణతంత్ర దినోత్సవ పరేడ్ జాతీయ గర్వానికి నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు
- పరేడ్ మన ప్రజాస్వామ్య బలాన్ని, వారసత్వ సంపదను చాటిచెప్పిందని ప్రశంస
- వేడుకల అనంతరం సంప్రదాయాన్ని పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచిన ప్రధాని
- ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన మోదీకి ఘన స్వాగతం
- భారత భద్రతా వ్యవస్థల శక్తిసామర్థ్యాలు అద్భుతమని కొనియాడిన ప్రధాని

- రాష్ట్రపతి బగ్గీలో కర్తవ్యపథ్‌కు ద్రౌపది ముర్ము
- జాతీయ జెండానుఆవిష్కరించిన రాష్ట్రపతి
- 21 గన్ సెల్యూట్ గౌరవ వందనం
- ప్రత్యేక ఆకర్షణగా మోదీ తలపాగా






### బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌కు

## సిట్ నోటీసులు

- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని ఆదేశాలు
- బీఆర్ఎస్ పార్టీలో కీలక నాయకుడిగా ఉన్న సంతోష్ రావు
- ఇప్పటికే కేటీఆర్, హరీశ్ రావులను విచారించిన సిట్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. (జనవరి 27) మధ్యాహ్నం మూడు గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో

- మిగతా 2లో



## భారత్‌తో మాది చారిత్రక బంధం

### రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్

- భారత రిపబ్లిక్ డే
- ప్రపంచంలోనే పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్యాల మధ్య చారిత్రక బంధం ఉందన్న ట్రంప్
- భారతీయులకు విషెస్ చెప్పిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో
- ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళతామని వెల్లడి

- మిగతా 2లో



## భారత్, ఈయూ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం..

### తగ్గనున్న కార్ల ధరలు!

- విజయవంతమైన భారత్ ప్రపంచానికి ఎంతో మేలు చేస్తుందన్న ఈయూ అధ్యక్షురాలు
- భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందానికి రంగం సిద్ధం
- ఈ ఒప్పందంతో 200 కోట్ల మందితో అతిపెద్ద మార్కెట్ ఏర్పాటు
- యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలు భారీగా తగ్గే అవకాశం

- మిగతా 2లో

## తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా...

## 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్
- అసెంబ్లీ, మండలి, సచివాలయంలోనూ రిపబ్లిక్ డే సంబరాలు





- హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా విజన్ డాక్యుమెంట్
- ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామి తెలంగాణ
- బతుకమ్మ వేడుకలకు గిన్నిస్ రికార్డు
- భిన్నత్వంలో ఏకత్వమే రాష్ట్రం
- హైదరాబాద్లో కాలుష్య నివారణకు హిల్ట్ పాలసీ
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ





## కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత, అసంతృప్తి ఉంది

### కోదండరాం సంచలన వ్యాఖ్యలు



- ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామన్న కోదండరాం
- మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తామన్న కోదండరాం
- కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టీకరణ

- మిగతా 2లో

## నేడు గవర్నర్‌ను కలవనున్న కేటీఆర్ బృందం

- సింగరేణి టెండర్లలో కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపణ
- సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పాత్ర ఉందని ఆరోపణ
- గవర్నర్‌కు సాక్ష్యాధారాలతో కూడిన నివేదికను ఇవ్వనున్న కేటీఆర్ బృందం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ప్రతినిధి

- మిగతా 2లో



## గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి.. మంత్రికి త్రుటిలో తప్పిన ప్రమాదం



- మక్తల్ గణతంత్ర వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరికి తప్పిన ప్రమాదం
- జెండా ఎగరేస్తుండగా మధ్యలోకి విరిగిపడిన కర్ర
- వేగంగా పక్కకు జరిగి సురక్షితంగా బయటపడ్డ మంత్రి
- ఘటనలో మరో వ్యక్తికి స్వల్ప గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

- మిగతా 2లో



## చిన్నారి ప్రాణాలు తీసిన చైనా మాంజా

- కూకట్‌పల్లిలో మాంజా కారణంగా ఐదేళ్ల బాలిక మృతి
- ఇద్దరు కుమార్తెలతో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఘటన
- బాలిక మెడకు చుట్టుకుని కిందపడి అక్కడికక్కడే మృతి

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు కేశవరావు జాదవ్

కేశవరావు జాదవ్ (జనవరి 27, 1933– జూన్ 16, 2018) తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర తొలి ప్రతిపాద కులలో ఒకరైన ప్రముఖ సీనియర్ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్. తెలంగాణ సాయుధ పోరాటం, ముల్కీ ఉద్యమం, జైతెలంగాణ పోరాటంతోపాటు తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్న నిఖార్సయిన నాయకుడు. తొలితరం తెలంగాణ ఉద్యమకారునిగా, అణగారిన వర్గాల పక్షపాతిగా, పౌరహక్కుల సంఘం నేతగా గుర్తింపు పొందాడు. పత్రికా రచయితగా, సంపాదకునిగా, చరిత్రకారునిగా, కవిగా, హక్కుల ఉద్యమకారునిగా, తెలంగాణ ఉద్యమకారునిగా, 'లోహియా విచార్ మంచ్' స్థాపకు నిగా, 'సంపూర్ణ తెలంగాణ ప్రజాసమితి' స్థాపకునిగా, సోషలి స్టు ఉద్యమ నాయకునిగా ఆయన కృషి, పట్టుదల, అకుంఠిత కార్య దీక్ష, రాజీలేని పోరాట పటిమ మరవ లేనివి. కేశవరావు జాదవ్ 1933, జనవరి 27న శంకర్‌రావు, అమృత దంపతులకు హైదరాబాదు పాత బస్తీలోని హుస్సేనీ ఆలంలో జన్మించాడు. ఎమర్జెన్సీలో హైదరాబాద్‌లో మొట్ట మొదటి అరెస్టు జాదవ్ దే కావడం గమనార్హం. 1952 నాన్ ముల్కీ గో బ్యాక్ ఉద్యమాన్ని నిర్వహించిన వారిలో ప్రముఖుడైన కేశవరావు 1975 ఎమర్జెన్సీ సమయంలో 18 నెలలపాటు జైలు జీవితాన్ని అనుభవించాడు. తెలం గాణ పోరాటంలో 1960, 70 దశకాల్లో విశేషమైన పాత్ర పోషించిన ఆయన, తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయాన్ని ఎత్తి చూపుతూ, ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను సంఘటితం చేయడంలో ప్రధాన పాత్ర పోషించాడు. హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ స్థాపించాడు. ఒలింపస్' అనే పత్రికను తెలంగాణ ఉద్యమానికి, విద్యార్థుల కార్యక్రమాలకు బాసటగా నిలుస్తూ వెలువరిం చాడు. 1969 ఉద్యమంలో క్రియా శీలకంగా పని చేశాడు. 1952 ముల్కీ ఉద్యమం నుంచి పోరాటం మొదలై, ఉపాధ్యాయ ఉద్యమా లలో భాగస్వామి అయినాడు. 2006లో తెలంగాణ జన ఐక్య కార్యాచరణ సమితి, 2008లో తెలంగాణ జన పరిషత్‌లో కీలక పాత్ర పోషించాడు. టు వర్డ్స్ మ్యాన్ కైండ్ (ఇంగ్లీషు), యువ పోరాటం (హిందీ) పత్రికలను నడి పాడు. భాషా సమస్య, మార్క్స్– గాంధీ– సోషలిజం (ఇంగ్లిష్), లోహి యా ఇన్ పార్లమెంట్ పుస్తకాలను వెలువరిం చాడు. నక్సల్స్ కు, ప్రభు త్వానికి మధ్య జరిగిన చర్చలలో కీలక భూమిక పోషించాడు. అట్ట డుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్‌కు కేశవరావు నాయ కత్వం వహించాడు. తెలంగాణ మలి దశ ఉద్యమంలోనూ జేఏసీద్వారా జయశంకర్, కోదండ రామ్‌తో కలిసి కేశవరావు జాదవ్ పనిచేశాడు. ఆయన పౌరహక్కుల సంఘం అధ్యక్షునిగా, తెలంగాణ జన పరిషత్ కన్వీనర్‌గా బాధ్యత లు నిర్వర్తించాడు. సోషలిస్టు నాయకుడు లోహియా అనుచరు డిగా జాదవ్‌కు గుర్తింపు ఉంది. ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీషు విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన కేశవరావు జాదవ్ ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశాడు. తెలంగాణ ప్రజలకు జరిగిన సవతి తల్లి ప్రేమను ఎదిరించాడు. నిరసించాడు. ఒకనాడు నైజాం ఏలుబడిలో ప్రాంతీయులకు ఇంగ్లీష్ భాషరాదని ఇక్కడ ఉద్యోగాలు చేయడానికి మద్రాసీ, బెంగాలీ, ఉత్తర భారతీయులను వేల సంఖ్యలో తీసుకువచ్చి ఉద్యోగాలు ఇవ్వడం, ఈ తతంగం ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక కూడా కొనసాగిన నేపథ్యంలో... కేశవరావు తన నిరసన గళాన్ని ఎత్తి వినిపించాడు. "మొద టి భాషా ప్రయుక్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు తెలుగు అర్థమవు తుందని, తెలుగు రాయ గలరనీ, చదవ గలరనీ, అట్లాంట ప్పుడు అడ్మినిస్ట్రేషన్ ఇంగ్లీష్‌లో ఎందుకు సాగాలనీ? అంతా ఇంగ్లీష్‌లోనే సాగాలి అనుకున్నప్పుడు భాషా ప్రయుక్త రాష్ట్ర ఏర్పాటు ఉద్దేశం, లక్ష్యం ఏమిటని ప్రశ్నించా డు. రమీజాబీ ఉదంతానికి నిరసన గా ఉద్యమాలు నిర్వహించాడు. 1968 నుంచి చనిపోయే నాటి వరకూ తెలంగాణ ఉద్యమంతో మమేకమయినాడు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా జరగాల్సిన పనుల గురించి గొంతు వినిపిస్తూనే ఉన్నాడు. చెన్నారెడ్డి లాంటి నాయకులతో విభేదించాడు. చెన్నారెడ్డికి పోటీగా 'సంపూర్ణ తెలంగాణ ప్రజా సమితి' అనే పార్టీని స్థాపించిన వారిలో జాదవ్ కూడా ఒకరు. తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ గా, పీయూసీఎల్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా, పౌర హక్కుల సంఘం అధ్యక్షునిగా, తెలంగాణ జనపరిషత్ కన్వీనర్ గా, సోషలిస్టు నాయకుడు లోహియా అనుచరు డిగా గుర్తింపు పొందాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కేశవరావు 2018, జూన్ 16న మరణించాడు. ం

## నేడు గవర్నర్‌ను కలవనున్న కేటీఆర్ బృందం

- మొదటి పేజి తరువాయి

బృం దం నేడు కలవనుంది. సింగరేణి వ్యవహారంపై వారు గవర్నర్‌కు సమగ్ర వివరాలు అందజేయనున్నారు. సింగరేణిలో భారీ కుంభకోణం జరిగిందని, ఇందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇతర మంత్రుల పాత్ర ఉందని ఆరోపిస్తూ వారు సాక్ష్యాధారాలతో కూడిన నివేదికను గవర్నర్‌కు సమర్పించనున్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ టెండర్ల ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంధువు సృజన్ రెడ్డికి లబ్ధి చేకూర్చేలా సింగరేణి టెండర్ల నిబంధనలను మార్చారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. సుమారు రూ.6 వేల కోట్ల విలువైన టెండర్లలో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను తీసుకువచ్చి, తమకు కావలసిన సంస్థలకే టెండర్లు దక్కేలా చేశారని ఆరోపిస్తున్నారు. సింగరేణికి రావాల్సిన లాభాలను పక్కదారి పట్టించి, ఎన్నికల ఖర్చులు, వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేయనున్నారు. సింగరేణి టెండర్ల ప్రక్రియపై సిట్టింగ్ జడ్జితో లేదా హైకోర్టు న్యాయమూర్తితో లేదా సీబీఐతో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది.

## బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌యకు సిట్ నోటీసులు

- మొదటి పేజి తరువాయి

విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఇటీవలే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారించారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులకు సిట్ దర్యాప్తు బృందం నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

# ఎర్రకోటపై మువ్వన్నెల రెపరెపలు

ఢిల్లీ : గణతంత్ర వేడుకలు దేశరాజధాని ఢిల్లీలో అంగరంగ వైభవంగా సాగాయి. రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము.. ముఖ్య అతిథులతో కలిసి సంప్రదాయ 'రాష్ట్రపతి బగ్గీ'లో కర్తవ్య పథ్కు చేరుకున్నారు. జాతీయ జెండాను ఆవిష్కరిం చిన అనంతరం, 21 గన్ సెల్యూట్తో గౌరవ వందనం స్వీకరించారు. ఈ ఏడాది యూరోపి యన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజర య్యారు. కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించిం ది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పా ల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్రెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఉదా. ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్లతో అది ఆకర్ష ణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్ర తిబింబించింది. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుక కు తగ్గట్టుగా ! ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్సూ టస్కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు. ఐరోపా సమాఖ్యకు ఉర్సులా తొలి మహిళా అధ్యక్షురాలు.

**ఆకట్టుకున్న సిందూర్**

'ఆపరేషన్ సిందూర్'లో వాడిన పలు స్వదేశీ ఆయుధ వ్యవస్థల ప్రదర్శన ఈ సారి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలిసారి బ్యాటిల్ ఆరే ఫార్మాట్'లో మన సైన్యం ఈ కవాతు లో పాల్గొంది. అంటే యుద్ధ క్షేత్రంలో పాల్గొంటున్నట్లుగా మన ఆయుధాలు, నిఘా వ్యవస్థలు, బలగాలను ఈ పరేడ్లో ప్రదర్శించారు. 'ఆపరేషన్ సిందూర్' థీమ్తో రూపొందించిన భారత సైన్యం శకటం మరింత ఆకట్టుకుంది. త్రివిధ దళాల సమన్వయం ఎంత శక్తిమంతంగా ఉంటుందో చాటిచెప్పేలా దీన్ని రూపొందించారు. బ్రహ్మోస్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు, 300 కి.మీ. దూరం వరకు లక్ష్యాలను ఛేదించగలిగే 'సూర్యాస్త్ర' రాకెట్ లాంచర్ వ్యవస్థ, యుద్ధట్యాంకు అర్జున్ వంటివి ఈ పరేడ్లో ప్రదర్శించారు. కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్, శక్తిబన్ రెజిమెంట్, రెండు మూపురాల ఒంటెలు, జన్స్కర్ గుర్రాలు వంటివి తొలిసారిగా కవాతులో పాల్గొన్నాయి.

# రిపబ్లిక్ డే పరేడ్ దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక: ప్రధాని మోదీ

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశరాజధాని ఢిల్లీలో అంబరాన్నంటాయి. కర్తవ్యపథ్‌లో జరిగిన అద్భుతమైన పరేడ్ ముగిసిన అనంతరం, ఈ వేడుకలు "దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక" అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ వేడుకల ద్వారా భారతదేశ ప్రజాస్వామ్య బలం, సాంస్కృతిక వారసత్వ సంపద, దేశాన్ని ఏకతాటిపై నిలిపే ఐక్యత ప్రదర్శితమయ్యాయని ఆయన పేర్కొన్నారు. దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంతో, గర్వంతో జరుపుకుందని ప్రధాని తెలిపారు. "గణతంత్ర దినోత్సవ పరేడ్, భారతదేశ అద్భుతమైన భద్రతా వ్యవస్థను ప్రదర్శించింది. ఇది మన దేశ సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యం, పౌరులను రక్షించడంలో మనకున్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అని మోదీ మరో పోస్ట్‌లో వివరించారు. మన భద్రతా దళాలు నిజంగా దేశానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. పరేడ్ ప్రారంభానికి ముందు, ప్రధాని మోదీ జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతో గణతంత్ర వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పరేడ్‌లో భారత సైన్యం తొలిసారిగా 'బ్యాటిల్ అర్రే' ఫార్మాట్‌లో తమ యుద్ధ నైపుణ్యాలను ప్రదర్శించింది. స్వదేశీ ఆయుధాలు, క్షిపణి వ్యవస్థలతో పాటు, వివిధ రాష్ట్రాలు, మంత్రిత్వ శాఖలకు చెందిన శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కర్తవ్యపథ్‌లో కనువిందు చేశాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా ప్రధాని మోదీ పరేడ్ ముగిశాక ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచారు. ఆయన చాలా దూరం నడుస్తూ, ఇరువైపులా ఉన్న ప్రేక్షకులకు అభివాదం చేశారు. ప్రధానిని చూసిన ప్రజలు 'భారత్ మాతా కీ జై', 'మోదీ–మోదీ' నినాదాలతో హోరెత్తించారు. చేతిలో త్రివర్ణ పతాకాలు పట్టుకుని, ఉత్సాహంగా ఆయనకు స్వాగతం పలికారు. చిన్నారులు కుర్చీలపైకి ఎక్కి మరీ ప్రధానిని చూసేందుకు ఆసక్తి చూపారు. కొంత దూరం నడిచిన తర్వాత, ప్రధాని తన వాహనంలోకి ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రాజస్థానీ సంప్రదాయ తలపాగా, నెమలి ఈకల అలంకరణతో మోదీ తన ప్రత్యేకమైన వస్త్రధారణతో మరోసారి ఆకట్టుకున్నారు.

# తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

తెలంగాణ వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అధికారిక కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర సచివాలయంతో పాటు జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లోనూ రిపబ్లిక్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దేశభక్తి వాతావరణం నెలకొంది.

రాష్ట్ర రాజధాని ఇమేజ్ పెంచేలా ప్రజా ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్ ను సిద్ధం చేసిందని గవ ర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఇవాళ సికింద్రాబాద్ లోని పరేడ్ మైదానంలో గణతంత్రదినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచిగౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభు త్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మేడారం అభివృద్ధి కోసం రూ.251 కోట్లుకేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసి నట్లు, ధాన్యానికి బోనస్ గా రైతులకు రూ.1, 780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. ఐటీఐ లను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్తో తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేం దుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నా మని గవర్నర్ పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చాము ని, మహిళలను పెట్రోల్ బంక్లు, ఆర్టీసీ అద్దె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. హై దరాబాద్లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవ ర్నర్ వెల్లడించారు.

## గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి.. మంత్రికి త్రుటిలో తప్పిన ప్రమాదం

నారాయణపేట జిల్లా మక్తల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి జాతీయ జెండాను ఎగురవేస్తుండగా, జెండా కర్ర విరిగిపడటంతో ప్రమాదం త్రుటిలో తప్పింది. ఈ ఘటనలో మంత్రి సురక్షితంగా బయటపడగా, మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మక్తల్ తహశీల్దార్ కార్యాలయంలో అధికారిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీహరి, మువ్వన్నెల జెండాను ఆవిష్కరించేందుకు తాడును లాగారు. అదే సమయంలో బరువును తట్టుకోలేక జెండా కర్ర మధ్యలోకి విరిగిపోయింది. విరిగిన కర్ర మంత్రిపై పడబోతుండగా, ఆయన అప్రమత్తమై వెంటనే పక్కకు తప్పుకున్నారు. దీంతో ఆయనకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే, విరిగిన కర్ర ముక్క అక్కడే ఉన్న మరో వ్యక్తిపై పడటంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, అధికారులు అతడిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో వేడుకల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. మంత్రి పాల్గొనే కార్యక్రమంలో నాణ్యత లేని కర్రను ఉపయోగించడంపై స్థానికులు అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుబడుతున్నారు .ప్రమాదం తర్వాత మంత్రి శ్రీహరి వేడుకలను కొనసాగించి జాతీయ పతాకానికి వందనం సమర్పించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత, అసంతృప్తి ఉంది

తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి నెలకొన్నాయని అన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీకి తమ నిర్ణయాన్ని తెలియజేశామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల అంశానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీని సంప్రదించామని, ఆ పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని ఆయన అన్నారు. తాము మాత్రం పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డపై ఉందని కోదండరాం అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణిని కార్పొరేట్ శక్తుల చేతిలో బందీ కానివ్వబోమని ఉద్ఘాటించారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినేనని ఆయన వెల్లడించారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేసినప్పుడు లేని భయం, విచారణ సమయంలో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. అమరవీరుల త్యాగంతో సాధించిన

తెలంగాణలో ప్రజలు పదేళ్లు అధికారమిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆయన విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరూ బాగుపడలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ జన సమితి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి మూడు కారణాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలన అంతం కావాలని, ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం ఒక ప్రయత్నం జరగాలని, ప్రభుత్వంలో తమకు భాగస్వామ్యం ఉండాలని కోరుకున్నామని ఆయన అన్నారు. ఈ కారణాల వల్లే తామంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికామని కోదండరాం తెలిపారు.

## చిన్నారి ప్రాణాలు తీసిన చైనా మాంజా

చైనా మాంజా కారణంగా మరో విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో ఐదేళ్ల బాలిక మాంజా కారణంగా ప్రాణాలు కోల్పోయింది. మేడ్చల్ జిల్లా ఖాజీపల్లి నుంచి తండ్రితో పాటు ఇద్దరు కుమార్తెలు ద్విచక్ర వాహనంపై కూకట్‌పల్లికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. వివేకానందనగర్ హైవే వద్ద చైనా మాంజా బాలిక నిష్విక మెడకు చుట్టుకుంది. దాంతో ఆమె కిందపడిపోయింది. తీవ్ర గాయం కావడంతో బాలిక అక్కడకక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చైనా మాంజా సాధారణ నూలు దారం కాదు. ఇది నైలాన్ లేదా సింథటిక్ పదార్థంతో తయారవుతుంది. దానిపై గాజు ముక్కల పొడిని పూస్తారు. ఈ దారం పక్షుల రెక్కలను, మనుషుల నరాలను కోసేంత ప్రమాదకరంగా ఉంటుంది. ఇది తెగిపోయి ఎక్కడైనా చిక్కుకుంటే ప్రాణాంతకంగా మారుతుంది. తెలంగాణ ప్రభుత్వం చైనా మాంజా అమ్మకాలపై నిషేధం విధించినప్పటికీ, కొందరు రహస్యంగా విక్రయిస్తున్నారు.

## భారత్‌తో మాది చారిత్రక బంధం

భారత్ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రభుత్వానికి, ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అత్యంత పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా అమెరికా, భారత్‌ల మధ్య చారిత్రాత్మక బంధం ఉందని ఆయన కొనియాడారు. సోమవారం ట్రంప్ సందేశాన్ని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో పంచుకుంది. "మీ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమెరికా ప్రజల తరఫున భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక అభినందనలు" అని ట్రంప్ తన సందేశంలో పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా భారత ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఏడాదిలో ఉమ్మడి లక్ష్యాల సాధనకు కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు ఆయన ఆకాంక్షించారు. "రక్షణ, ఇంధనం, కీలక ఖనిజాలు, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగాల్లో మన మధ్య బలమైన సహకారం ఉంది. క్వాడ్ వేదికగా బహుళస్థాయి భాగస్వామ్యంతో ఇరు దేశాలకు, ఇండో–పసిఫిక్ ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతోంది" అని రూబియో తన ప్రకటనలో వివరించారు.

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి, దేశం సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను చాటుతూ దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ పరేడ్, దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తారు.

## భారత్, ఈయూ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం..తగ్గనున్న కార్ల ధరలు!

విజయవంతమైన భారత్... ప్రపంచాన్ని మరింత స్థిరంగా, సుసంపన్నంగా, సురక్షితంగా మారుస్తుందని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ అన్నారు. భారత్ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, భారత్‌తో చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం ఖరారు కానున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన ఆమె, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో కలిసి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. రేపు ప్రధాని మోదీతో జరగనున్న శిఖరాగ్ర సమావేశంలో భారత్, 27 దేశాల యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఖీూా)పై చర్చలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ ఒప్పందాన్ని "అన్ని ఒప్పందాలకూ తల్లిలాంటిది" (ఎశ్ట్రవతీ శీట ఖశ్రీశ్రీ నమ్మశ్రీం) అని, "చరిత్రాత్మక ఒప్పందం" అని ఉర్సులా గతంలో అభివర్ణించారు. ఈ ఒప్పందం ద్వారా దాదాపు 200 కోట్ల జనాభాతో కూడిన అతిపెద్ద మార్కెట్ ఏర్పడుతుందని, ఇది ప్రపంచ జీడీపీలో దాదాపు నాలుగో వంతు అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్... భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇరుపక్షాల మధ్య వస్తు వాణిజ్యం 135 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ వాణిజ్య ఒప్పందం కోసం 2007లో చర్చలు ప్రారంభమైనా, 2013లో నిలిచిపోయాయి. 2022లో ఈ చర్చలను తిరిగి ప్రారంభించారు.

ఈ ఒప్పందంలో భాగంగా యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలను భారీగా తగ్గించడానికి భారత్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 110శాతం వరకు ఉన్న పన్నును తొలుత 40 శాతానికి, ఆ తర్వాత దశలవారీగా 10 శాతానికి తగ్గించనున్నట్లు సమాచారం. ఇది వోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ వంటి లగ్జరీ కార్ల కంపెనీలకు భారత మార్కెట్‌లో ప్రవేశాన్ని మరింత సులభతరం చేస్తుంది. దీంతో భవిష్యత్తులో యూరప్ కార్ల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

# హార్వర్డ్ యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి..
# లీడర్ షిప్ కోర్సు స్పెషల్ క్లాసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్ షిప్ కోర్సు క్లాసులకు హాజరయ్యారు సీఎం రేవంత్‌రెడ్డి. తొలిరోజు 21వ శతాబ్ధంలో నాయకత్వంపై కోర్సులో భాగంగా అధికారిక విశ్లేషణ నాయకత్వం అంశంపై తొలి సెషన్‌సాగింది. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థిగా మారి క్లాసులు విన్నారు.క్లాసుల్లో భాగంగా అధికారిక విశ్లేషణ నాయకత్వం అంశంపై కేస్ అనాలిసిస్, వివిధ అంశాలపై తరగతులు, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్ వంటి కార్యక్రమాల్లో సభ్యులు పాల్గొన్నారు. హార్వార్డ్ యూనివర్సిటీకి

- మిగతా 6లో...

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్



మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..




పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి..




మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ మను చౌదరి..

- పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన కలెక్టర్ మను..
- పలువురిని అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..
- మల్కాజిగిరి డిసిపి శ్రీదర్, అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు..
- విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు..

# మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో...
# 77 వ గణతంత్ర దినోత్సవం వేడుకలు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 26:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ఎంతో ముందంజలో ఉందని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం, సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. . సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శామీర్‌పేట్ అంతాయపల్లి లోని కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి ఉదయం 9.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.. మల్కాజిగిరి డిసిపి సిహెచ్. శ్రీధర్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు.

అనంతరం గత సంవత్సర కాలంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి కలెక్టర్ తెలియజేసారు.. జిల్లాను అన్నిరంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లి అభివృద్ధిలో ముందుంచేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు.. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని ఆయా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన, విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరింపజేశాయి.. గణతంత్ర దినోత్సవం వేడుకలను పురస్కంచుకొని ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేసారు..

-4లో

# దేశభక్తి ఊపిరిగా..!
# తిరంగానే శక్తిగా..!



- సూరారంలో రెండువేల మంది విద్యార్థులతో ఘనంగా తిరంగా ర్యాలీ..!
- ర్యాలీలో సామాజిక వేత్త పర్యావరణ ప్రేమికుడు రవిందర్ ముదిరాజ్ పాల్గొన్నారు..



- 100 మీటర్ల జాతీయ జెండాతో కదం తొక్కిన యువత ర్యాలీ..
- దాదాపు 2 వేల మంది విద్యార్థుల వాడవాడల తిరంగా ర్యాలీ..
- దేశభక్తి నినాదాలతో మార్మోగిన సూరారం రహదారులు..

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వరంగల్ రాజకీయాల్లో కీలక పరిణామం..
# బీజేపీకి ఆరూరి రమేష్ రాజీనామా




**హైదరాబాద్ పెన్ పవర్:** వరంగల్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీజేపీ సభ్యత్వానికి మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు ఆరూరి రమేష్ ప్రకటించారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వరంగల్ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ఆరూర్ రమేష్ పోటీ చేసిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ వరంగల్

- మిగతా 6లో...

భక్తిశ్రద్ధలతో జాతీయ పతాకానికి జర్నలిస్టుల సెల్యూట్..



- సూరారం ప్రెస్ క్లబ్ ఆవరణలో వైభవంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు..
- టీయుడబ్ల్యుజే హెచ్-143 నూతన కమిటీ ఆధ్వర్యంలో ముప్పన్నెల జెండా ఆవిష్కరణ.
- రాజ్యాంగ విలువల పరిరక్షణపై జర్నలిస్టులకు ఉపదేశం..
- ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్రను గుర్తు చేసిన నూతన కమిటీ..
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భారీ సంఖ్యలో పాల్గొన్న విలేకరులు..

# రాజ్యాంగ పరిరక్షణే...
# జర్నలిస్టుల ధర్మం..!

## కుత్బుల్లాపూర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 26:రాజ్యాంగమే దేశానికి వెన్నెముక అయితే..! అందులో జర్నలిస్టులే ప్రజాస్వామ్య పరిరక్షకులు.. కుత్బుల్లాపూర్ టీయుడబ్ల్యుజే (హెచ్-143) ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.. దేశ ప్రజాస్వామ్యానికి ప్రాణమైన భారత రాజ్యాంగాన్ని కాపాడటమే జర్నలిస్టుల ప్రధాన బాధ్యత అంటూ టీయుడబ్ల్యుజే హెచ్-143 నాయకులు స్పష్టం చేశారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం ప్రెస్ క్లబ్ ఆవరణలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హెచ్-143 నూతన కమిటీ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు శివాజీ, గౌరవ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సిరిగిరి శ్రీనివాస్, అధ్యక్షుడు మాధగారి సుగ్రీవుడు, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కోశాధికారి ఎర్రోళ్ల బాబు, టెంజు కన్వీనర్ ఎర్రోళ్ల కృష్ణతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు మరియు పలువురు సీనియర్ పాత్రికేయులు కలిసి ముప్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు.. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తి భావాలను వ్యక్తం చేశారు..

## రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా జర్నలిస్టులు..

యూనియన్ నాయకులు మాట్లాడుతూ సుమారు రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలనను పారద్రోలేందుకు, ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించిందని గుర్తు చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగ సభలో చర్చించి, సవరించి, ఆమోదించిన సభ్యులు 280 కాగా, చివరికి 7 మంది సభ్యులు డ్రాఫ్టింగ్ (రచనా బాధ్యత)తో రూపొందిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చి దేశానికి దిశానిర్దేశం చేసిందని తెలిపారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, స్వేచ్ఛలు, సమానత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడితో పాటు, జర్నలిస్టులపై మరింత ఉందని స్పష్టం చేశారు.. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభమని పేర్కొన్నారు. నిజనిర్ధారణతో కూడిన బాధ్యతాయుత జర్నలిజమే సమాజానికి మార్గదర్శకమని అభిప్రాయపడ్డారు. 77 ఏళ్ల ప్రజాస్వామ్య ప్రయాణంలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలవడం గర్వకారణమని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు, డీజీ శివ, సతీష్, శ్రీనివాస్, ప్రసాద్, సాగర్, శివతో పాటు నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన విలేకరులు భారీ సంఖ్యలో పాల్గొని గణతంత్ర వేడుకలను విజయవంతం చేశారు.. అనంతరం మిఠాయిలు పంచుకుంటూ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు..




కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న టీయుడబ్ల్యుజే హెచ్-143 నూతన కమిటీ..

# మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో.. 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు..


కార్యక్రమంలో విద్యార్థుల విన్యాసాలు..



ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు..



## సంక్షేమం, అభివృద్ధి పనుల్లో ముందడుగు..

గత ఏడాది కాలంగా జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక వసతుల విస్తరణ, పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతుల బలోపేతం, పేదల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు చేరవేయడంలో అధికారులు చూపుతున్న చురుకుదనం వంటి అంశాలు జిల్లాను అభివృద్ధి దిశగా తీర్చి దిద్దుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు..

పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూల జిల్లా హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న మేడ్చల్ జిల్లా పరిశ్రమలు, లాజిస్టిక్స్, ఐటీ ఆధారిత సంస్థలకు ఆకర్షణీయ కేంద్రంగా మారుతోందని అధికారులు తెలిపారు.. పరిశ్రమల స్థాపనతో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు, జిల్లా ఆదాయ వనరుల పెరుగుదల, పట్టణగ్రామీణ సమతుల్య అభివృద్ధి, సాధ్యమవుతోందని తెలిపారు..

**జిల్లా ఖ్యాతిని పెంచుతున్న సమిష్టి కృషి..**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో అభివృద్ధి పరిశ్రమలు, విద్య, సంక్షేమం అన్నింటిలోనూ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తున్న జిల్లాగా మారుతోందని అధికారులు పేర్కొన్నారు. ఈ పురోగతిని కొనసాగించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, కలెక్టరేట్ ఏఓ సుజాత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..





# దేశభక్తి ఊపిరిగా..! తిరంగానే శక్తిగా..!


సూరారంలో 100 ఫీట్ల తిరంగ ర్యాలి..

- సూరారంలో రెండువేల మంది విద్యార్థులతో ఘనంగా తిరంగా ర్యాలీ..!
- ర్యాలీలో సామాజిక వేత్త పర్యావరణ ప్రేమికుడు రవిందర్ ముదిరాజ్ పాల్గొన్నారు..



- 100 మీటర్ల జాతీయ జెండాతో కదం తొక్కిన యువత ర్యాలీ..
- దాదాపు 2 వేల మంది విద్యార్థుల వాడవాడల తిరంగా ర్యాలీ..
- దేశభక్తి నినాదాలతో మార్మోగిన సూరారం రహదారులు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 26:**

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలంసూరారంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించారు.. “దేశభక్తే ఊపిరిగా.. తిరంగానే శక్తిగా..!” అన్న నినాదానికి రూపంగా ప్రదర్శించారు.. సూరారం కాలనీకి చెందిన కోల శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ తిరంగా ర్యాలీ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.. దాదాపు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ర్యాలీలో, 100 మీటర్ల పొడవైన భారీ జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ పాఠశాలల విద్యార్థులతో పాటు యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.. ర్యాలీ సాగిన ప్రతి అడుగులోనూ “భారత మాతాకీ జై”, “వందే మాతరం” నినాదాలతో సూరారం ప్రాంతం మొత్తం దేశభక్తి ఉత్సాహంతో మార్మోగింది. త్రివర్ణ పతాకాన్ని గర్వంగా మోస్తూ, యువత క్రమశిక్షణతో ముందుకు సాగడం అందరి ప్రశంసలు అందుకుంది.. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, యువతలో రాజ్యాంగ విలువలు, జాతీయ ఐక్యత, దేశంపై ప్రేమను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గణతంత్ర దినోత్సవం వంటి సందర్భాల్లో ఇలాంటి కార్యక్రమాలు యువతను దేశ నిర్మాణానికి దగ్గర చేస్తాయని అభిప్రాయపడ్డారు.. సూరారంలో నిర్వహించిన ఈ తిరంగా ర్యాలీ, గణతంత్ర దినోత్సవానికి దేశభక్తి ప్రతీకగా నిలిచి, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.. ఈ కార్యక్రమంలో విక్రంరెడ్డి, శ్రీనాథ్, విక్కీ, కేశవ్, యుగంధర్, రాజశేఖర్, ప్రవీణ్, ప్రసాద్, రాజ్‌కుమార్, వేణు, వికాస్ స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


సామాజిక వేత్త రవిందర్ ముదిరాజ్ అండ్ యూత్..


ర్యాలీలో పాల్గొన్న స్థానికులు, సూరారం పోలీసులు..


కోలా శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వాడవాడలా తిరంగ ర్యాలీ..


ర్యాలీలో పాల్గొన్న, కోలా శ్రీకాంత్ ముదిరాజ్ అండ్ యువకులు..

# బీ.ఆర్. అంబేద్కర్ ఆలోచనలే మార్గదర్శకం..

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు..

## ఎమ్మార్పీఎస్డా.బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

**జీడిమెట్ల, పెన్ పవర్, జనవరి 26:**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం కాలనీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ పార్కు మరియు బాబు జగ్జీవన్ రామ్ ఓపెన్ పార్కు సముదాయంలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి పార్టీ, మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.. అనంతరం రాజ్యాంగ విలువలు, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణపై నాయకులు ప్రసంగించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి పార్టీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు మరియు
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కాటం దేవయ్య హాజరై మాట్లాడారు.. డాక్టర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వల్లే నేడు ప్రతి పౌరుడికి హక్కులు లభిస్తున్నాయి. వాటిని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యతని ఆయన అన్నారు.
ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బురు రవి, మట్ట నర్సింలు, కలుమూరి సాంబా, బంసోడె కురుమయ్య, సుదర్శన్, రాజేష్, శ్రీనివాస్, బాలేష్, భాస్కర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీకి చెందిన యువత, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మహంకాళి నగర్‌లో.. గణతంత్ర దినోత్సవ వేడుకలు..

నిరుడి రాజు ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు..





కూకట్‌పల్లి మహంకాళి నగర్‌లో 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు

- మహంకాళి బస్తీలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు..
- ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్..
- జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరికెపూడి,కార్పొరేటర్ వెంకటేష్..
- రాజ్యాంగ విలువలు గౌరవిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేయాలన్న ఎమ్మెల్యే..
- ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొన్నది..

**కూకట్‌పల్లి, పెన్ పవర్, జనవరి 26:** భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లమ్మబండ మహంకాళి నగర్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిరుడి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.. అనంతరం గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యత లను ప్రతి పౌరుడు గౌరవిస్తూ దేశ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.. మహంకాళి నగర్ అభివృద్ధి దిశగా ప్రజల సహకారంతో ముందుకు సాగుతున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. జాతీయ గీతాలాపన, దేశభక్తి నినాదాలతో మహంకాళి నగర్ పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమం మొత్తం దేశభక్తి వాతావరణంలో ఉత్సాహంగా సాగింది.

# గణతంత్ర దినోత్సవ వేడుకల్లో..! మాజీ కౌన్సిలర్..

## బౌరంపేట్,ఇందిరమ్మ కాలనీలో దేశభక్తితో గణతంత్ర దినోత్సవ వేడుకలు..





- దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేట్‌లో పలుచోట్ల ఘనంగా గణతంత్ర వేడుకలు..
- పలుచోట్ల జాతీయ జెండా ఆవిష్కరించిన మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి..
- బౌరంపేట్ ప్రభుత్వ పాఠశాల ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్..
- విద్యార్థులకు బహుమతులు పంపిణీ, అనంతరం పాఠశాల అభివృద్ధికి హామీ..

**హైదరాబాద్ పెన్ పవర్:** 77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్, ఇందిరమ్మ కాలనీలో పలుచోట్ల పండుగ వాతావరణం నెలకొన్నది.. దేశభక్తి వాతావరణంలో గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పలుచోట్ల జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు.. అనంతరం దేశభక్తి నినాదాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.బౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రత్యేకంగా పాల్గొన్నారు. పాఠశాలలో నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిబద్ధతతో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని, పిల్లల భవిష్యత్తు కోసం వారు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, అదే నిజమైన దేశసేవగా మారుతుందని అన్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం తమ వంతుగా ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎస్.వి.సురేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కాలనీ నాయకులు కామేశ్వరరావు, భూషణ్, లక్ష్మణ్, శ్యామ్, బాబు, బాబీ, గోపాల్, ఎల్లయ్య, సాయి తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..







# హాఫీజ్‌పేట్‌లో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు..





- హాఫీజ్‌పేట్ ఇంజనీర్ ఎన్‌క్లేవ్, ఆర్టీసీ కాలనీ క్రికెట్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవం వేడుకలు.
- ముఖ్యఅతిథిగా జాతీయ టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు పోరెడ్డి బుచ్చిరెడ్డి..
- జాతీయ జెండా ఆవిష్కరించిన బుచ్చిరెడ్డి..
- రాజ్యాంగ విలువల పరిరక్షణ, యువత విద్యఉపాధి వోకల్ ఫర్ లోకల్‌మేక్ ఇన్ ఇండియాపై పిలుపు..
- బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక, ప్రజలు భారీగా పాల్గొన్నారు..



**శేరిలింగంపల్లి, పెన్ పవర్, జనవరి 26:**శేరిలింగంపల్లి నియోజకవర్గం, హాఫీజ్‌పేట్ డివిజన్‌లోని ఇంజనీర్ ఎన్‌క్లేవ్ మరియు ఆర్టీసీ కాలనీ క్రికెట్ గ్రౌండ్ వద్ద 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ అజిత్ సేనాపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు పోరెడ్డి బుచ్చిరెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవం రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులుకర్తవ్యాలను గుర్తు చేసుకునే రోజని అన్నారు. యువత ఉన్నత విద్య, ఉపాధి, స్వయం ఉపాధి ద్వారా 'వోకల్ ఫర్ లోకల్‌మేక్ ఇన్ ఇండియా'కి తోడ్పడాలని, డ్రగ్స్ రహిత దేశ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హాఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంఘాల ప్రతినిధులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్టలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు..

## ఇందిరాగాంధీ చౌరస్తాలో దేశభక్తి నినాదాలతో మార్మోగింది..



జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ చౌరస్తాలో సాయికుమార్ పటేల్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం వేడుకలు.



స్థానికులకు, వేడుకలకు హాజరైన అందరికీ స్వీట్లు పంపిణీ..



- **జాతీయ జెండా ఆవిష్కరించిన పంతుల సాయికుమార్ పటేల్..**
- **రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబాటని స్పష్టం..**
- **స్థానిక నాయకులు, ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో..**

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 26:** జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ చౌరస్తాలో స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశభక్తి నినాదాలతో పరిసర ప్రాంతాన్ని మారుమోగించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎన్ఎస్‌యుఐ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పంతుల సాయికుమార్ పటేల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు టిఫిన్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి, గణతంత్ర దినోత్సవానికి ప్రత్యేకతను చేకూర్చారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు ఇచ్చిన హక్కులు, విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగ విలువలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టేందుకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి మౌలిక సిద్ధాంతాలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు సూచించారు.. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. దేశభక్తి గీతాలు, నినాదాలతో ఇందిరాగాంధీ చౌరస్తా ప్రాంతం ఉత్సాహభరిత వాతావరణంతో కళకళలాడింది..

# నిజాంపేట్ సర్కిల్ పరిధిలో.. సిపిఐ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు..







**దుండిగల్, పెన్ పవర్, జనవరి 26:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో, సిపిఐ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంపేట్ వార్డు కార్యాలయం, రాజధాని స్కూల్, నిజాంపేట్ డంపింగ్ యార్డ్ వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.. ఈ కార్యక్రమాలకు సిపిఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి అధ్యక్షత వహించగా, సిపిఐ సీనియర్ నాయకులు ఆశీ. యాదయ్య, కోలన్ (లీడర్) నర్సింహా రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ..గణతంత్ర దినోత్సవం భారత రాజ్యాంగాన్ని అధికారికంగా అమలు చేసిన దినంగా జరుపుకుంటారు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది, భారతదేశం గణతంత్ర రాజ్యంగా మారింది.

భారతదేశం రాజ్యాంగాన్ని అమలు చేసుకున్న ఈ రోజును గణతంత్ర దినోత్సవమని, అందుకే ఈ రోజున దేశవ్యాప్తంగా జాతీయ జెండాను ఎగురవేస్తామని తెలిపారు. రాజ్యాంగం అమలై 77 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ సమాజంలో అసమానతలు పూర్తిగా తొలగిపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు..

**అవినీతి విస్తరిస్తోందని ఆవేదన..**

పేదవాడు పేదవాడిగానే మిగిలిపోతున్నాడని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, అవినీతి విస్తరిస్తోందని పాలబిందెల శ్రీనివాస్ విమర్శించారు. గాలిలో కాలుష్యం పెరుగుతుండగా, వీటిపై ప్రశ్నించిన వారిని జైలుకు పంపుతున్న పరిస్థితి ఉందన్నారు.. మరోవైపు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తం చేశారు.. దేశంలో అసమానతలు తొలగి, రాజ్యాంగ విలువలు కాపాడబడాలంటే ప్రతి భారత పౌరుడు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నందు, చంద్రయ్య, నర్సింహా, లక్ష్మణ్, మోహన్, మోహన్ రెడ్డి, నర్సమ్మ, భాగ్యమ్మ, యాదమ్మ, ఉపేంద్ర, పద్మ, లక్ష్మి, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కోటగుళ్లలో గణపేశ్వర స్వామికి త్రివర్ణ పతాక అలంకరణ

**భూపాలపల్లి, జనవరి 26 పెన్ పవర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం త్రివర్ణ పతాక అలంకరణలో గణపేశ్వర స్వామిని కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## 1000 మీటర్ల జాతీయ పతాకంతో బజరంగ్ దళ్ భారీ ర్యాలీ

**రాజేంద్రనగర్, జనవరి 26 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా, రాజేంద్ర నగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లీ డివిజన్ లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా, మైలర్ దేవ్ పల్లీ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో స్థానిక యువత, విద్యార్థులు కలిసి 1000 మీటర్ల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మైలర్ దేవ్ పల్లీ, దుర్గా నగర్, బాబు రెడ్డి నగర్ మీదుగా సాగింది.

## గణతంత్ర దినోత్సవం: మద్దులువాయి గ్రామ ప్రజల ఘన నివాళి



**మెదక్, జనవరి 26 పెన్ పవర్:** హవేలీ ఘనపూర్ మండలంలోని మద్దులువాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, భారతదేశ స్వాతంత్ర్యం మరియు రాజ్యాంగ నిర్మాణం కోసం పాటుపడిన మహనీయులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మద్దులువాయి సర్పంచ్ గజ్జల జైలు, గ్రామ సెక్రెటరీ హేమంత్, వార్డ్ సభ్యులు నరసమ్మ, సౌందర్య, జయరాజ్, మాజీ వార్డ్ సభ్యులు గజ్జల బాల పోచయ్య మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మెదక్ జిల్లా, మెదక్ నియోజకవర్గంలో జరిగింది.

## బిల్లుపాడులో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ఖమ్మం, జనవరి 26పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, సత్తుపల్లిలోని తల్లాడ మండలం బిల్లుపాడు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు గౌసుద్దీన్ నిత్యావసర సరుకులు పంపిణీ



**వైరా, జనవరి 26పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, వైరా నియోజకవర్గం, కారేపల్లి మండల కేంద్రంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా మైనార్టీ నాయకులు గౌసుద్దీన్ ఆధ్వర్యంలో 40 మంది నిరుపేదలకు, వికలాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. అనాథ పిల్లలకు దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన పేదలకు తాను అండగా ఉంటానని, సేవ చేస్తున్నానని గౌసుద్దీన్ తెలిపారు. మరిన్ని సేవలకు అందరూ ముందుకు రావాలని ఆయన కోరారు.

## పుట్టకోటలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**మధిర, జనవరి 26పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, పుట్టకోట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు 2026 జనవరి 26న ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ, ఆత్మ డైరెక్టర్ శంకర్, ఆత్మ డైరెక్టర్ కోటేశ్వరరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సోమ గాని నరసింహారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవం: దేశభక్తి జీవన విధానంలో ఉండాలి



**వరంగల్ ఈస్ట్, జనవరి 26పెన్ పవర్:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అన్నారం పల్లవి మోడల్ స్కూల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, విద్యార్థులకు దేశభక్తి మాటల్లో కాకుండా జీవన విధానంలో కనిపించాలని, నిజాయితీతో ఎదిగి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం, పోలీస్ స్టేషన్, గ్రామపంచాయతీతో పాటు పలు పాఠశాలల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## వరంగల్ రాజకీయాల్లో కీలక పరిణామం.. బీజేపీకి ఆరూరి రమేష్ రాజీనామా

-3 పేజి తరువాయి

జిల్లా అధ్యక్షుడిగా, వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఆరూరి రమేశ్ పనిచేశారు.

వరంగల్ లోక్‌సభ స్థానంలో బీజేపీ నుంచి బరిలో దిగిన అభ్యర్థి ఆరూరి రమేశ్‌కు నిరాశే ఎదురైంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు వరకు బీఆర్ఎస్‌లో కొనసాగిన ఆయన.. గెలిచే టికెట్‌గా భావించి బీజేపీలో చేరినా ఫలితం మాత్రం దక్కలేదు. కేంద్రంలో మోదీ, బీజేపీ ఇమేజ్‌తో ఇన్నాళ్లు గెలుపు ధీమాతో ఉన్న ఆయనకు 2024లో లోక్ సభ ఫలితాలు ఊహించని షాక్‌ఇచ్చాయి. ఆరూరిపై వ్యక్తిగత వ్యతిరేకత ఉండడంతో మోదీ చరిష్మా కూడా పని చేయలేదని పలువురు అంటున్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో గెలిచిన ఆరూరి రమేశ్..2023 శాసనసభ ఎన్నికల్లోనూ లక్షకు పైగా మెజారిటీ ఆశించారు. ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టి, బీఆర్ఎస్ సర్కారు ఏర్పడితే మంత్రి పదవి పొందాలని ఆశపడ్డారు. కానీ ఆయనపై, అనుచరులపై ఉన్న వ్యతిరేకతతో 19,458 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

తర్వాత బీఆర్ఎస్ నుంచి ఎంపీ టికెట్ ప్రయత్నాలు చేసినప్పటికీ గులాబీ పార్టీకి, వ్యక్తిగతంగా తనకు పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో మోదీ చరిష్మాతోనైనా గెలవవచ్చనే ఉద్దేశంతో బీజేపీ వైపు చూశారు. బీఆర్ఎస్ఎంపీ టికెట్‌ఇస్తానన్నా వద్దనుకుని నాటకీయ పరిణామాల మధ్య 2024, మార్చి17న కాషాయ కండువా కప్పుకున్నారు. మొదటిసారి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి కావ్య చేతిలో ఓడిపోయారు.

## హార్వర్డ్ యూనివర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి.. లీడర్ షిప్ కోర్సు స్పెషల్ క్లాసులు

-3 పేజి తరువాయి

చెందిన కెనెడీ స్కూల్ లో సోమవారం(జనవరి 26) ఉదయం ఏడుగంటలకే తరగతులు ప్రారంభం కాగా సాయంత్రం 6గంటలవరకు కొనసాగాయి. దావోస్ లో మూడు రోజుల పర్యటన పూర్తిచేసుకున్న తర్వాత హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్ షిప్ కోర్సుకోసం సీఎం రేవంత్ రెడ్డి అమెరికా బయలుదేరి వెళ్లారు. జనవరి 30 వరకు అమెరికాలో సీఎం పర్యటన కొనసాగనుంది. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థిగా మారి.. హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్ షిప్ పై సర్టిఫికెట్ కోర్సుఅభ్యసిస్తున్నారు. హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ కోర్సు చేస్తున్న తొలి సీఎంగా అరుదైన ఘనత దక్కించుకోనున్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆదిలాబాద్ ఎస్పి

**ఆదిలాబాద్, జనవరి 26 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి అఖిల్ మహాజన్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు పూర్తయి, 77వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.

## ఆదిలాబాద్ లో సమతా సైనికల్ దళ్ ఆధ్వర్యంలో ర్యాలీ

**బోథ్, జనవరి 26 పెన్ పవర్:** రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును పురస్కరించుకుని ఆదిలాబాద్‌లో సోమవారం సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అశోక బుద్ధ విహార్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు సాగిన ఈ ర్యాలీలో 'జై భీమ్' నినాదాలు మార్మోగాయి. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులు, చట్టాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

# ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా చర్యలు

**నిర్మల్, జనవరి 26 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు పరేడ్ మైదానంలో ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా కలెక్టర్ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి, ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై 25 శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను దాదాపు 15 నిమిషాల పాటు తెలుగులో వివరించి ప్రజలను ఆకట్టుకున్నారు.

## రవాణా శాఖ కార్యాలయంలో పతాకావిష్కరణ

**ఖానాపూర్, జనవరి 26 పెన్ పవర్:** నిర్మల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా రవాణా అధికారి శివపల్లి శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు కోలా రవీందర్, హరిద్ర కుమార్, విజయ్ కుమార్, ఫాహిమా సుల్తానా, ఏఓ జైవంత్ రాథోడ్, ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ జాతరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం



**మానకొండూరు, జనవరి 26 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లి గ్రామంలో ఈనెల 28 నుంచి 31 వరకు జరగనున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు రావాలని జాతర కమిటీ చైర్మన్ జంగిడి సంజీవరెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. 40 ఏళ్లుగా జరుగుతున్న ఈ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, అన్ని సౌకర్యాలు కల్పించామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ కాంతల శివారెడ్డి, ఓంటెల సంపత్ రెడ్డి, కొండం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**కరీంనగర్, జనవరి 26 పెన్ పవర్:** కరీంనగర్ లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి, భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమని, అభివృద్ధికి నాంది అని కొనియాడారు. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ మేధస్సుతో రూపొందించబడిన రాజ్యాంగం ఇతర దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని, ప్రజాస్వామ్య ఆశయాలను, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందని, కులమత బేధాలు లేకుండా సమాన అవకాశాలు కల్పిస్తుందని, పౌరుల హక్కులకు రక్షణ కల్పిస్తుందని, శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలను సక్రమంగా నడిపిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి లోబడి విధులు నిర్వర్తించి దేశ ప్రగతికి చేయూతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి రాష్ట్రస్థాయి అవార్డు

**హుజూరాబాద్, జనవరి 26 పెన్ పవర్:** ఎన్నికల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఓటర్ల అవగాహన, సిబ్బందికి శిక్షణ, పారదర్శక ఎన్నికల ప్రక్రియలో ఆమె చూపిన వినూత్న కృషికి ఈ గౌరవం దక్కింది. ఈ విజయం జిల్లా యంత్రాంగం సమష్టి కృషి అని కలెక్టర్ పేర్కొన్నారు.

## భీమన్న స్వామి పాహిమాం...

**వేములవాడ, జనవరి 26 పెన్ పవర్:** వేములవాడ రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న భీమన్న ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. రాజన్న స్వామికి ఇష్టమైన సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో రోజుకు లక్షల్లో భీమేశ్వరున్ని భక్తులు దర్శించుకునేందుకు వస్తున్నారు. ఆలయ ఈవో రమాదేవి, అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

## పెగడపల్లి మార్కెట్ కమిటీలో చైర్మన్ బుర్ర రాములు గౌడ్ జాతీయ పతాకం ఆవిష్కరణ

**సిరిసిల్ల, జనవరి 26 పెన్ పవర్:** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా, ధర్మపురిలోని పెగడపల్లి మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఓరుగల అరుణ-శ్రీనివాస్, వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి, తహసీల్దార్ ఆనంద్ కుమార్, ఎంపీడీవో ఫ్రేమ్ సాగర్ రావు, ఎంఏవో శ్రీకాంత్, ఎస్సై కిరణ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఉప సర్పంచ్ బత్తుల ప్రదీప్, మార్కెట్ కమిటీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మహిళల ఉచిత బస్సు ప్రయాణం: ఎమ్మెల్యే రాగమయి మహిళలతో ముచ్చట

**సిరిసిల్ల, జనవరి 26 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకంపై స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులను నేరుగా కలిసి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకాన్ని దేశంలోనే గొప్ప పథకంగా అభివర్ణిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కచెల్లెళ్లకు అందించిన గొప్ప కానుక అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రేరణ పోటీల పోస్టర్లను ఆవిష్కరణ




**ముథోల్, జనవరి 26 పెన్ పవర్:** బోథ్ లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 'ప్రేరణ' పేరుతో మూడు రోజుల పాటు క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల పోస్టర్లతో పాటు ఆదిలాబాద్ జిల్లా లోగోను కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆవిష్కరించారు. ఈ నెల 28 నుండి 30 వరకు జరిగే ఈ పోటీలలో అన్ని యాజమాన్యాల కింద ఉన్న బాలికల గురుకులాల విద్యార్థినులు పాల్గొంటారు. జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ క్రీడలకు రూ. 25 లక్షలు ప్రత్యేకంగా కేటాయించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఓటరు చైతన్యమే.. ప్రజాస్వామ్యానికి దన్ను

**హైదరాబాద్, జనవరి 26 పెన్ పవర్:** ప్రజాస్వామ్యం అనేది కేవలం ఒక రాజకీయ వ్యవస్థ మాత్రమే కాదు.. అది ప్రజల చైతన్యానికి ప్రతిరూపం. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిది మన ఓటు హక్కు. ఈ ఓటు హక్కు అనేది భారతదేశంలాంటి వైవిధ్యాలు గల దేశంలో సాధారణ హక్కు మాత్రమే కాదు, ప్రజల చేతుల్లో ఉన్న సార్వభౌమాధికారం. అంబేద్కర్ లాంటి మహనీయుడు ఓటు హక్కును ఒక ఆయుధంగా అభివర్ణించారు. 'ఓటు అనేది ప్రజల చేతికి ఒక కత్తి (ఆయుధం) వంటిది. దీని ద్వారా వారు తమ హక్కులను, స్వేచ్ఛను కాపాడుకోవడమే కాకుండా, సమాజంలో సామాజిక, ఆర్థిక మార్పులను కూడా తీసుకురాగలరు' అని ఆయన విశ్వసించారు. భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించింది. ఇది రాజ్యాంగ నిర్మాతలు ప్రజలపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనం. చదువు, సంపద, కులం, మతం, లింగం వంటి భేదాలు లేకుండా ప్రతి పౌరుడికి ఒకే ఓటు విలువ ఉండటం భారత ప్రజాస్వామ్యానికి గొప్ప బలం. ఓటు ద్వారా ప్రజలు తమ పాలకులను మాత్రమే కాదు, దేశం, రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించే అధికారం కూడా తమ చేతుల్లోనే ఉంచుకుంటారు.

ప్రజల అవసరాలు, ఆకాంక్షలు, సమస్యలు ప్రభుత్వ విధానాల్లో ప్రతిబింబించాలంటే ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాలి. 'నా ఓటు ఫలితాలను మారుస్తుందా?' అని తేలిగ్గా తీసుకోవద్దు. ఒక్క ఓటు తేడాతో ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి గారు అధికారాన్ని కోల్పోయిన సందర్భం చరిత్రలో ఉంది. 'నేనొక్కడినే ఓటేయకపోతే కొంపలు మునుగుతాయా?' అని అనుకోవద్దు. నిజంగానే కొంపలు మునుగుతాయి.. ఆ మాటకొస్తే దేశాలు, రాష్ట్రాలే మునుగుతాయి. ఒక డాక్టర్ తప్పు చేస్తే ఒక రోగి మాత్రమే చనిపోతాడు. కానీ ఒక రాజకీయ నాయకుడు తప్పు చేస్తే లక్షలాది మంది భవిష్యత్తుపై దాని ప్రభావం పడుతుంది. ప్రజలు ఓటు వేయడం వల్లే ప్రభుత్వం ప్రజలకు బాధ్యతగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయినప్పటికీ నేటి సమాజంలో చాలా మంది ఓటు వేయడాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఓటు అనేది కేవలం ఒక హక్కు మాత్రమే కాకుండా ఒక బాధ్యత అని ప్రతి ఒక్కరూ భావించాలి. ప్రజలు ఎన్నికల్లో పాల్గొనకపోతే ప్రజాస్వామ్యం బలహీనంగా మారే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో కొద్దిమంది మాత్రమే ఓటు వేయడం వల్ల వారి అభిప్రాయాలే ప్రభుత్వ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

చరిత్రను పరిశీలిస్తే ఓటు హక్కు కోసం అనేక ఉద్యమాలు జరిగాయి. మహిళలు, అణగారిన వర్గాలు చాలా కాలం పాటు తమ హక్కుల కోసం పోరాటం చేశారు. ఓటు ద్వారా సామాజిక మార్పు సాధ్యమని ఈ ఉద్యమాలు స్పష్టంగా నిరూపించాయి. అయినా నేటి యువతలో ఓటు ప్రాధాన్యతపై సరైన అవగాహన లేకపోవడం బాధాకరం. పేదరికం, నిరుద్యోగం, విద్య, ఆరోగ్యం వంటి సమస్యల పరిష్కారానికి సరైన నాయకులను ఎన్నుకోవడం అత్యంత అవసరం. అయినా కొంతమంది 'ఓటు వేయడం వల్ల ఏమి మారుతుంది?' అనే భావనతో ఎన్నికలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల సమయంలో ప్రలోభాలు పెరుగుతుండటం ఓటు పవిత్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రజల సంకల్పం కాకుండా ప్రలోభాలే ఫలితాలను నిర్ణయిస్తే పాలనపై విశ్వాసం దెబ్బతింటుంది. కుల, మత రాజకీయాలు కూడా ఓటు సంస్కృతిని దెబ్బతీస్తున్నాయి. అభివృద్ధి, పరిపాలనా సామర్థ్యం కంటే సామాజిక గుర్తింపులే ప్రాధాన్యం పొందడం సమాజాన్ని విభజన దిశగా నడిపిస్తోంది. దీని వల్ల ప్రజాస్వామ్య చర్చల స్థాయి తగ్గిపోతోంది. 1951-52లో జరిగిన తొలి సాధారణ ఎన్నికలు భారత ప్రజాస్వామ్యానికి ఒక చారిత్రక ఘట్టం. అక్షరాస్యత తక్కువగా ఉన్నప్పటికీ సుమారు 45 శాతం ఓటింగ్ నమోదు కావడం రాజ్యాంగంపై ప్రజల విశ్వాసాన్ని చాటింది. 1977 ఎన్నికలు ఓటు శక్తిని దేశానికి మరోసారి గుర్తుచేశాయి. అత్యవసర పరిస్థితి అనంతరం ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని తమ అసంతృప్తిని బ్యాలెట్ ద్వారా వ్యక్తం చేశారు. 1990లలో ప్రాంతీయ పార్టీల ఉద్భవం, కూటమి రాజకీయాలు ఓటర్ల ఆసక్తిని మరింత పెంచాయి. ఇటీవలి 2014, 2019 ఎన్నికల్లో ఓటింగ్ శాతం చరిత్రాత్మక స్థాయికి చేరింది. మహిళలు, గ్రామీణ ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రజాస్వామ్యానికి సానుకూల సంకేతం.

ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయ చర్చల దిశను మార్చిన ప్రధాన సాధనం సోషల్ మీడియా. ఇది సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా తొలిసారి ఓటు వేయబోయే యువతకు ఇది రాజకీయ ప్రవేశ ద్వారంగా మారింది. అయితే తప్పుడు వార్తలు, అర్ధసత్యాలు, ఎడిట్ చేసిన వీడియోలు ఓటర్ల నిర్ణయాన్ని తప్పుదారి పట్టిస్తున్నాయి. వైరల్ అయినదే నిజమన్న భావన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. అల్గారిథమ్ ప్రభావం వల్ల ఓటర్లు ఒకే అభిప్రాయ వలయంలో పరిమితమవుతున్నారు. డబ్బుతో నడిచే డిజిటల్ ప్రచారం, లక్ష్యిత ప్రకటనలు, బాట్ ఖాతాలు ఎన్నికల సమానత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. సోషల్ మీడియా శత్రువూ కాదు, రక్షకుడూ కాదు; అది ఒక సాధనం మాత్రమే. దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామన్నదే అసలు ప్రశ్న. ఎన్నికల కమిషన్‌తో పాటు సోషల్ మీడియా సంస్థలు తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలి. అంతకంటే ముఖ్యంగా ప్రజల్లో మీడియా లిటరసీ పెంపొందించాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి విషయాన్ని నమ్మకుండా ఆలోచించి, పరిశీలించి నిర్ణయం తీసుకునే సంస్కృతి పెరిగినప్పుడే ఈ డిజిటల్ యుగంలో ప్రజాస్వామ్యం బలంగా నిలుస్తుంది.

# ఫర్నిచర్ షాపులో అడుగడుగునా ఉల్లంఘనలు




**హైదరాబాద్, జనవరి 26 పెన్ పవర్:**
హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న బచ్చాస్ ఫర్నిచర్ దుకాణంలో శనివారం చోటుచేసుకున్న భారీ అగ్ని ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ దుకాణంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యాదయ్య, లక్ష్మి దంపతుల కుమారులు అఖిల్, ప్రణీత్ మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో దట్టమైన పొగ, మంటలు చుట్టుముట్టడంతో ఆ చిన్నారులు గది మూలకు వెళ్లి దాక్కున్నారు. కానీ, గాలి ఆడని స్థితిలో పొగకు ఊపిరాడక వారు అక్కడికక్కడే నిర్జీవంగా పడిపోయారు. అయితే ఆ రోజు బడికి పిల్లలు బతికేవాళ్లేనట. 'అయ్యో దేవుడా.. బడికి వెళ్తే నా బిడ్డలు బతికేవాళ్లు' అంటూ ఆ తల్లిదండ్రులు ఉస్మానియా ఆసుపత్రి వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న తీరు అక్కడి వారిని కన్నీరు పెట్టించింది. ఈ ప్రమాదంలో కేవలం చిన్నారులే కాకుండా.. వారిని కాపాడేందుకు ప్రాణాలకు తెగించి లోపలికి వెళ్ళిన సేల్స్‌మ్యాన్ మహ్మద్ ఇంతియాజ్, ఆటో డ్రైవర్ సయ్యద్ హబీబ్, మరో మహిళ బేబీ కూడా మృత్యువాత పడ్డారు. వాస్తవానికి ఆ ఫర్నిచర్ దుకాణంలోని సెల్లార్ ఒక మృత్యుకుహరాన్ని తలపించింది. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్‌ను యజమాని పూర్తిగా ఫర్నిచర్, ప్రమాదకరమైన రసాయనాలతో నింపేశారు. కేవలం ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలిగే సందు మినహా, లోపల ఎటు చూసినా సామగ్రి అడ్డదిడ్డంగా ఉండటంతో మంటలు వ్యాపించినప్పుడు బాధితులు బయటకు వచ్చే దారి దొరకక లోపలే చిక్కుకుపోయారు. ప్రమాదానికి గల కారణాలపై అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్ కుమార్ స్పందిస్తూ.. ప్రాథమిక దర్యాప్తులో షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు అంటుకున్నట్లు గుర్తించామన్నారు. అగ్నిమాపక వాహనాలు ఘటన జరిగిన 25 నిమిషాల్లోనే చేరుకున్నప్పటికీ.. సెల్లార్‌లోని గ్రిల్స్, షట్టర్లకు తాళాలు వేసి ఉండటం వల్ల లోపలికి వెళ్లడం కష్టతరమైందని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి సెల్లార్‌ను గోదాంగా మార్చినందుకు గానూ, వాచ్‌మెన్ యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు యజమాని సతీశ్ బచ్చాపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. జేఎన్‌టీయూ నిపుణుల బృందం ప్రమాద స్థలాన్ని సందర్శించి భవనం పటిష్టతను, ప్రమాద తీవ్రతను పరిశీలించింది. జీహెచ్ఎంసీ మరియు అగ్నిమాపక శాఖ ఇచ్చే తుది నివేదికల ఆధారంగా తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. లాభాల కోసం యజమానులు చేసే చిన్న పొరపాట్లు, సామాన్య పేద కుటుంబాల జీవితాలను ఎలా బుగ్గిపాలు చేస్తాయనడానికి ఈ నాంపల్లి ఘటనే నిదర్శనం.

# ఇక తెలంగాణలో ఎస్ ఐ ఆర్

**హైదరాబాద్, జనవరి 26 పెన్ పవర్:**
తెలంగాణలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ త్వరలో నిర్వహించే అవకాశం ఉంది ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ.. మిగిలిన రాష్ట్రాలలో SIR త్వరలో అమలు చేస్తాం, నిజమైన ఓటర్ల జాబితాలు ప్రజాస్వామ్యానికి పునాది అని ఆయన అభివర్ణించారు. అయితే తెలంగాణలో ఈ SIR అమలు చేస్తే ప్రజల నుంచి కొన్ని పత్రాలు కోరే అవకాశం ఉంది. మరి అవేంటో తెలుసుకుంటే రెడీగా ఉండొచ్చు. గణన దశలో ఓటర్లు ఎటువంటి పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే నోటీసు దశలో అవి మ్యాప్ చేయకపోతే, లేదా ఓటర్ నిర్ధారణలో ఏమైనా సమస్యలు ఉంటే వారు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. గణన ఫారమ్‌లో ఓటర్లు మునుపటి ా×= నుండి తమ లేదా వారి బంధువుల వివరాలను ఇవ్వవచ్చు. ఈ రెండు వివరాలను ఇవ్వడం వలన లింక్ చేయడం లేదా మ్యాపింగ్ చేయడంలో సహాయపడుతుంది. అటువంటి ఓటర్లు గణన ఫారమ్‌లు తప్ప మరే పత్రాలను సమర్పించాల్సిన అవసరం లేదు.

**మ్యాపింగ్ కొరకు బంధువులు:**

తండ్రి
తల్లి
తల్లి తరపు తాత
అమ్మమ్మ
తండ్రి తరపు తాత
తండ్రి తరపు నాన్నమ్మ

జాబితాలో పేరు లేదా బంధువుల పేరు (సంతాన భావన) లేని వారు తెలంగాణ, ఇతర రాష్ట్రాలలో SIR తరువాతి దశలో పత్రాలను సమర్పించమని అడుగుతారు. వ్యక్తి ఈ క్రింది 11 పత్రాలలో ఒకదాన్ని సమర్పించాలి

ఏదైనా కేంద్ర ప్రభుత్వం/రాష్ట్ర ప్రభుత్వం/శాఖ సాధారణ ఉద్యోగి/పెన్షనర్‌కు జారీ చేయబడిన ఏదైనా గుర్తింపు కార్డు/పెన్షన్ చెల్లింపు ఉత్తర్వు. 1987 జూలై 1కి ముందు భారతదేశంలో ప్రభుత్వం/స్థానిక అధికారులు/బ్యాంకులు/పోస్ట్ ఆఫీసt/LIC/PSఖలు జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు/సర్టిఫికేట్/పత్రం.

సమర్థ అధికారం జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం.

పాస్‌పోర్ట్‌గుర్తింపు పొందిన బోర్డులు/విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్/విద్యా ధృవీకరణ పత్రం

సమర్థ రాష్ట్ర అధికారం జారీ చేసిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం

**అటవీ హక్కుల ధృవీకరణ పత్రం**

OBC/SC/ST లేదా కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ఏదైనా కుల ధృవీకరణ పత్రం

జాతీయ పౌరుల రిజిస్టర్ (అది ఎక్కడ ఉన్నా)

రాష్ట్ర/స్థానిక అధికారులు తయారుచేసిన కుటుంబ రిజిస్టర్.

ప్రభుత్వం నుండి ఏదైనా భూమి/ఇల్లు కేటాయింపు ధృవీకరణ పత్రంఆధార్ కోసం, 09.09.2025 తేదీ 23/2025`ERS/Vol.II లేఖ ద్వారా జారీ చేయబడిన కమిషన్ ఆదేశాలు వర్తిస్తాయి. అయితే SIRకి అవసరమైన పత్రాలు హైదరాబాద్, ఇతర తెలంగాణ జిల్లాల్లోని అందరు ఓటర్లకు పుట్టిన తేదీ ఆధారంగా ఉంటాయి. జూలై 1, 1987 కి ముందు జన్మించిన వారు తమ కోసం జాబితా చేయబడిన ఏవైనా పత్రాలను సమర్పించాలి. మరోవైపు జూలై 1, 1987న లేదా ఆ తర్వాత, డిసెంబర్ 2, 2004న లేదా అంతకు ముందు జన్మించిన వారు తమ కోసం ఒక పత్రాన్ని, తండ్రి లేదా తల్లి పత్రాన్ని అందించాలి. 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమ తల్లిదండ్రులిద్దరికీ సంబంధించిన పత్రాన్ని సమర్పించాలి.

# క్రాస్ రోడ్స్ లో జగన్ .. సజ్జల వైపా, విజయసాయి వైపా..

**విజయవాడ, జనవరి 26, పెన్ పవర్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కోటరీ రగడ ఇప్పుడు బహిరంగ చర్చకు వచ్చేసింది. పార్టీ ఆవిర్భావం నుండి జగన్ వెన్నంటే ఉండి, 2019 విజయపథంలో కీలక పాత్ర పోషించిన విజయసాయిరెడ్డి, ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి , జగన్‌కు దూరమయ్యారు. కానీ తాను జగన్ కోసం పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన సంకేతాలు పంపుతున్నారు. కాకపోతే ప్రస్తుతం ఉన్న సజ్జల కోటరీని బయటకు పంపాలంటున్నారు. దీంతో జగన్ కు ఇప్పుడు కొత్త ఆలోచనలు వచ్చే అవకాశం ఉంది. ఒకప్పుడు జగన్ 'ఏ-2'గా, పార్టీకి వెన్నెముకగా భావించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు దూరమయ్యారు. అయితే తాను జగన్‌కు దూరం కాలేదని, తనను జగన్ నుండి ప్రస్తుతం ఉన్న కోటరీ సభ్యులే దూరం చేశారని ఆయన బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి సహా ప్రస్తుతం జగన్ చుట్టూ ఉన్న వారికి కనీస రాజకీయ పరిజ్ఞానం లేదని, వారు జగన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించడం పార్టీలో ఉన్న తీవ్ర విభేదాలను సూచిస్తోంది. తనను తిరిగి పార్టీ బాధ్యతల్లోకి తీసుకుంటే కూటమిని విడగొట్టి, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతానని ఆయన చేస్తున్న ప్రకటన వైసీపీ శ్రేణుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.వైసీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో విజయసాయిరెడ్డి పట్ల సానుకూలత కనిపిస్తోంది. 2019 ఎన్నికల సమయంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి, బూత్ స్థాయి వరకు యంత్రాంగాన్ని నడిపించిన ఘనత విజయసాయిరెడ్డిదేనని మెజారిటీ కార్యకర్తలు నమ్ముతున్నారు. అదే సమయంలో 2024 ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి సజ్జల రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని కోటరీ అనుసరించిన అతి విశ్వాసం, కార్యకర్తలకు నేతలను దూరం చేసిన తీరే కారణమని క్యాడర్ బలంగా విశ్వసిస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను జగన్ దృష్టికి వెళ్లకుండా అడ్డుకున్నారనే అపవాదు సజ్జల కోటరీపై బలంగా పడింది.ప్రస్తుతం జగన్ మోహన్ రెడ్డి ఒక కీలకమైన కూడలిలో ఉన్నారు. ఆయన ముందు ప్రధానంగా రెండు మార్గాలు కనిపిస్తున్నాయి: ఒకటి, గడిచిన ఐదేళ్లుగా తన వెన్నంటే ఉండి, పార్టీ విధానాలను నడిపించిన సజ్జల. ప్రస్తుత కోటరీనే నమ్ముకుని ముందుకు సాగడం. రెండు, పాత మిత్రుడిని, వ్యూహకర్తను విశ్వసించి విజయసాయిరెడ్డికి మళ్లీ పగ్గాలు అప్పగించడం. అయితే, జగన్ సాధారణంగా తాను నమ్మిన వారిని వదులుకోవడానికి ఇష్టపడరని, కానీ ఇప్పుడు పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడిన తరుణంలో ఆయన తన పంథాను మార్చుకుంటారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.విజయసాయిరెడ్డి ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులతో వ్యక్తిగత సంబంధాలను కలిగి ఉన్నారు. ఆయనను పక్కన పెట్టడం వల్ల ఉత్తరాంధ్రతో పాటు పలు జిల్లాల్లో పార్టీ పట్టు కోల్పోయిందనే వాదన ఉంది. మరోవైపు, సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని విభాగాలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేసినప్పటికీ, అది కేవలం పాలనాపరమైన సలహాలకే పరిమితమైందని, రాజకీయ వ్యూహాల్లో ఆయన విఫలమయ్యారని పార్టీలోని ఒక వర్గం భావిస్తోంది. ఇప్పుడు విజయసాయిరెడ్డి నేరుగా సవాల్ విసురుతున్నందున జగన్ ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతం ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అత్యంత పటిష్టంగా ఉంది. ఇటువంటి బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాలంటే కేవలం సామాజిక సమీకరణాలు మాత్రమే సరిపోవని, రాజకీయంగా చీలికలు తెచ్చే పక్కా వ్యూహాలు అవసరమని విజయసాయిరెడ్డి అభిప్రాయపడుతున్నారు. ఆయనకు ఉన్న పాత నెట్‌వర్క్, రాజకీయ చాణక్యం ఇప్పుడు పార్టీకి అవసరమని క్యాడర్ కోరుకుంటోంది. జగన్ తన కోటరీని ప్రక్షాళన చేయకుండా కేవలం ప్రజల్లోకి వెళ్తే ఫలితం ఉండదని, లోపల వ్యవస్థను మార్చాలని కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో జగన్ కోటరీలో మార్పులు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ విజయసాయిరెడ్డిని జగన్ ఆహ్వానిస్తే సజ్జల కోటరీ బయటకు పోవాల్సి ఉంటుంది. జగన్ ఇప్పటికీ మౌనంగానే ఉంటూ పరిణామాలు గమనిస్తున్నారు. విజయసాయిరెడ్డి చేస్తున్న ప్రతిపాదన జగన్ హృదయాన్ని గెలుచుకుంటుందా లేక కోటరీ గోడలకు తగిలి వెనక్కి వస్తుందా అనేది వేచి చూడాలి.



# గీతం చుట్టూ వివాదం...

**విశాఖపట్టణం, జనవరి 26, పెన్ పవర్:** విశాఖపట్నంలోని గీతం విద్యా సంస్థలకు సంబంధించిన భూముల క్రమబద్ధీకరణ అంశం ప్రస్తుతం రాజకీయంగా, జనవరి 30, 2026న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని అజెండాలో చేర్చడం వివాదానికి దారితీసింది. అది అప్పనంగా భూములు కట్టబెట్టడమేనని వైసీపీ సహా కొంత మంది సామాజికవేత్తలు ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఇవి తమకు గతంలో కేటాయించినవేనని గీతం అంటోంది. సుమారు 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించాలని జీవీఎంసీ ప్రతిపాదించింది. విశాఖలోని అత్యంత ఖరీదైన రుషికొండ, ఎండాడ గ్రామాల్లోని సర్వే నంబర్లు 17/1, 17/28 వంటి చోట్ల ఈ భూములు ఉన్నాయి. గీతం సంస్థ 1980లలో స్థాపించబడింది. అప్పటి నుంచి వివిధ దశల్లో ప్రభుత్వం కేటాయించిన భూములతో పాటు, మరికొంత భూమిని సంస్థ తన అధీనంలో ఉంచుకుందన్న ఆరోపణలు ఉన్నాయి. సుమారు 4 దశాబ్దాలుగా ఈ భూములు ఆ సంస్థ ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భూముల చుట్టూ ఉన్న వివాదం ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో , గీతం సంస్థ సుమారు 40 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించిందని ఆరోపిస్తూ రెవెన్యూ అధికారులు కొన్ని ప్రహరీ గోడలను కూల్చివేసి, భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆ భూములకు కంచె వేసి ప్రభుత్వ భూమి అని బోర్డులు కూడా పెట్టారు. అక్కడ ప్రస్తుతం భూముల విలువ భారీగా పెరిగింది. విలువైన భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు తక్కువ ధరకే లేదా ఉచితంగా క్రమబద్ధీకరించడంపై మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ వంటి మేధావులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, విద్యా సంస్థల అవసరాల దృష్ట్యా ఈ భూములను క్రమబద్ధీకరించాలని భావిస్తోంది. దీనిని జీవీఎంసీ కౌన్సిల్ అజెండాలో 15వ అంశంగా చేర్చారు. కౌన్సిల్ ఆమోదం పొందితే, ప్రభుత్వం నిర్ణయించిన క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించి గీతం సంస్థ ఈ భూములను అధికారికంగా పొందవచ్చు.గీతం విద్యాసంస్థల యాజమాన్యం తమపై వస్తున్న ఆక్రమణ ఆరోపణలను మొదటి నుంచి ఖండిస్తూనే ఉంది. సంస్థ ప్రతినిధుల ప్రకారం, గీతం క్యాంపస్ ఉన్న భూమిలో మెజారిటీ భాగం 1980వ దశకంలో అప్పటి ప్రభుత్వం నుంచి అధికారికంగా కేటాయించింది. విద్యాసంస్థల విస్తరణ కోసం అప్పట్లో భూములను ప్రభుత్వం కేటాయించిందని, తాము నిబంధనలకు విరుద్ధంగా ఏదీ నిర్మించలేదని వారు వాదిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు, గీతం యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములకు సంబంధించి తమ వద్ద తగిన పత్రాలు ఉన్నాయని వారు కోర్టుకు సమర్పించారు. అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వారు వాదించారు. గీతం ఒక లాభాపేక్ష లేని విద్యాసంస్థగా, వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని వారి వాదన. క్యాంపస్‌లో ఉన్న ఖాళీ స్థలాలు లేదా వివాదాస్పదంగా మారిన భూములు కూడా క్రీడా మైదానాలుగా, విద్యా సంబంధిత సౌకర్యాల కోసమే వాడుతున్నామని వారు చెబుతున్నారు. దశాబ్దాల కాలంగా సంస్థ ఆధీనంలో ఉన్న భూములను ఇప్పుడు ఆక్రమణలుగా పరిగణించడం సరికాదని వారి అభిప్రాయం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏదైనా సాంకేతిక కారణాల వల్ల భూమి కేటాయింపులో లోపాలు ఉంటే, ప్రస్తుత ప్రభుత్వ జీవోల ప్రకారం నిర్ణీత రుసుము చెల్లించి ఆ భూములను క్రమబద్ధీకరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని సంస్థ గతంలోనూ సూచించింది. గీతం సంస్థ వాదన ప్రకారం, వారు ఏ భూమినీ ఉద్దేశపూర్వకంగా ఆక్రమించలేదు. 40 ఏళ్లుగా విద్యా సేవలు అందిస్తున్న సంస్థపై రాజకీయ కారణాలతోనే ఆరోపణలు వస్తున్నాయని, చట్టపరంగా తమకు హక్కులు ఉన్నాయని వారంటున్నారు. గీతం యాజమాన్యం రాజకీయ కుటుంబం. ప్రస్తుతం విశాఖ ఎంపీగా ఉన్న భరత్ విద్యాసంస్థ వ్యవహారాలు చూస్తున్నారు. మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి మనవడు భరత్. ఆయన బాలకృష్ణ అల్లుడు కూడా. అంటే సీఎం చంద్రబాబుకు సమీప బంధువే. రాజకీయ కుటుంబం కావడంతో ఈ వ్యవహారంపై మరిన్ని ఆరోపణలు వస్తున్నాయి. ఆ భూములు దశాబ్దాలుగా విద్యా సంస్థ అవసరాలకు వాడుతున్నా ఆ విషయం ఎక్కడా బయటకు రాకుండా ఆరోపణలు చేస్తున్నారని భరత్ వర్గీయులు అంటున్నారు. మొత్తానికి ఈ వివాదం రాజకీయ మలుపులు తిరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# లోకల్ పోల్స్ కు జనసేన ప్లాన్



**కాకినాడ, జనవరి 16, పెన్ పవర్:** పార్టీ పెట్టినప్పటి నుంచి పవన్ స్ట్రాంగ్ ఓ నమ్మకం మీదే ఉంటూ వస్తున్నారు. 20 ఏళ్లు పోరాడడానికి కూడా సిద్ధం. కానీ వన్స్ వి స్టెప్ ఇన్..పాతుకు పోతామంటూ చెప్పుకొచ్చారు. ఎవరి మీదో ఆధారపడి..ఏ పార్టీ నుంచో లీడర్లు వస్తారని..ఆశపడట్లేదు. నాయకులు ఎక్కడి నుంచో రారు. కార్యకర్తలనే లీడర్లుగా తీర్చిదిద్దుతామంటున్నారు.ఇదే విషయంపై గత కొన్ని రోజులుగా సీరియస్ ఫోకస్ పెట్టారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే పనిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 21 అసెంబ్లీ, ఇద్దరు ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్సీలు, ముగ్గురు మంత్రులు, పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లతో బలంగా ఉన్న పార్టీని రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేయాలని ఫిక్స్ అయిపోయారు. కూటమిలో భాగస్వామ్యంగా ఉంటూనే సొంతంగా బలపడేందుకు వ్యూహ రచన చేస్తున్నారు.అధికారం, విపక్షం అన్న తేడా లేకుండా.. రోల్ ఏదైనా పది కాలాల పాటు పార్టీ నిలబడాలని కలలు కంటున్నారు పవన్. ఇందుకోసం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పటిష్టతపై ఫోకస్ పెట్టి..పార్టీ కమిటీలు నియామక ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. మార్చి 14న జనసేన ఆవిర్భావ దినోత్సవం నాటికి కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని డెడ్ లైన్ పెట్టారు.పార్టీలో జరుగుతున్న కొన్ని అంతర్గత సంఘటనలపైనా పవన్ దృష్టి పెట్టారట. వీటిపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై జనసేన నేతలతో ఇటీవలే పవన్ సమావేశం నిర్వహించారు. కొందరు పార్టీ నేతల చుట్టూ ఉన్న వివాదాలు ఆర్థిక, వ్యక్తిగత ఘర్షణలు, మానసిక బలహీనతలు, వ్యక్తిగత, కుల విభేదాలు, వివాహేతర సంబంధాల విషయంలో జరుగుతున్న గొడవలపై పవన్ ఆరా తీసినట్లు ఇన్‌సైడ్ టాక్.అలాంటివన్నీ వ్యక్తిగత అంశాలుగా మాత్రమే చూడాలని..పార్టీ పరంగా వారిపై యాక్షన్ తీసుకోవాలని ముఖ్య నేతలకు సూచించారు పవన్. అయితే ఇలాంటివన్నీ పార్టీకి ఆపాదించే కుట్ర జరుగుతుందని అలాంటి వాటిని తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచిస్తున్నారు పవన్. అయితే పవన్ ఇంతలా పార్టీపై ఫుల్ ఫోకస్ పెట్టడానికి ప్రధాన కారణం స్థానిక సంస్థల ఎన్నికలే అంటున్నారు నేతలు.సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు మాత్రమే తీసుకున్న పవన్..స్థానిక సంస్థల ఎన్నికల్లో..మెజార్టీ స్థానాలు తీసుకుని పట్టు సాధించేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారట. కూటమిలో భాగంగా జనసేనకు బలం ఉన్నచోట్ల ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే యోచనలో ఉన్నారట. మార్చిలోపు పార్టీ నిర్మాణం పూర్తి చేసి..స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలనేది పవన్ ఆలోచనగా చెబుతున్నారు.పాలిటిక్స్ ఈజ్ ఆల్‌వేస్ డైనమిక్స్. రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎప్పటికప్పుడు పరిస్థితులను బట్టి మారుతూనే ఉంటాయ్. పాలిటిక్స్ ఎప్పుడు ఎలా ఉంటాయో ఎవరు చెప్పలేని పరిస్థితి. పైగా ప్రజెంట్ పాలిటిక్స్ అయితే వెరీ డిఫరెంట్. ఇవాళ ఓ పార్టీలో ఉన్న నేత రేపు ఏ పార్టీలో ప్రత్యక్షం అవుతారో..ఎందుకు పార్టీ మారుతారో అంతకంటే అర్థం కానీ పొలిటికల్ సినారియో ఈనాటిది. రాజకీయం అంటే అవసరాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు అన్నట్లుగా మారిపోయిన సిచ్యువేషన్.కానీ జనసేన పుట్టుక వేరు. అది నడుస్తున్న తీరు వేరు. ఓ లక్ష్యం కోసం..రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్తుంటారు పవన్ కళ్యాణ్. తానే రెండుచోట్ల ఓడినా..ఆయన పార్టీ ఎక్కువ రోజుల ఉండదని విమర్శలు వచ్చినా..ఆయనెక్కడా తగ్గలేదు. పదవుల కోసం ఆరాటపడలేదు. కానీ పార్టీని మాత్రం లైమ్‌లైట్‌లో ఉంచుతూ వచ్చారు.ఎందుకంటే గతంలో ఎంతోమంది పార్టీలు పెట్టి కొన్ని రోజులు పాలిటిక్స్‌లో ఉండి తిరిగి బ్యాక్ టు పెవిలియన్ అన్నవారున్నారు. కానీ పవన్ రూటు సెపరేటు. ఆయనదంత ఫ్యూచర్ ప్లాన్. అధికారం, ప్రతిపక్షం అనే మాటల కంటే..మంచి కోసం మార్పు అనే లైన్‌లోనే పనిచేసుకుంటూ వస్తున్న సేనాని ఇప్పుడు సరికొత్త స్కెచ్ వేస్తున్నారట.జనసేన అనేది అధికారం కోసం..అవసరాల కోసం ఏర్పడలేదని ప్రూవ్ చేసేందుకు..రాబోయే తరానికి మంచి నేతలను..మంచి రాజకీయ సంప్రదాయాలను అందించేలా ఫ్యూచర్ ప్లాన్ రెడీ చేశారట. అందుకు స్థానిక సంస్థల ఎన్నికలను, మున్సిపోల్స్‌ను అస్త్రంగా మార్చుకోవాలని భావిస్తున్నారట సేనాని. పవన్ స్ట్రాటజీస్ ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి మరి.

## మారుతోన్న నగరి లెక్కలు

**తిరుపతి, జనవరి 26, పెన్ పవర్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి నియోజకవర్గం లో రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది. గత ఎన్నికల సమయంలో కనిపించిన సమీకరణలకు భిన్నంగా ఇప్పుడు పరిస్థితులు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ మార్పులు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకురాలు రోజా రాజకీయ భవితవ్యంపై చర్చను మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నాయి. ఒకప్పుడు నగరి పరిసర మండలాల్లో రోజా పేరు బలంగా వినిపించేది. కానీ గత ఎన్నికలకు ముందే ఆమె ఉనికి తగ్గినట్టు కనిపించగా, ఇప్పుడు మరింత మౌనం నెలకొన్నట్టు రాజకీయ వర్గాలు మాట్లాడుకుంటున్నాయి.నగరి నియోజకవర్గంలో నింద్ర , విజయపురం , నగరి , పుత్తూరు, వడమాలపేట వంటి మండలాలు ఉన్నాయి. వీటిలో గత ఎన్నికలకు ముందు వరకు నింద్ర, వడమాలపేటల్లో రోజాకు గట్టి మద్దతు ఉందనే భావన ఉండేది. మంత్రిగా ఉన్న రోజుల్లో కూడా ఆమె ఈ రెండు మండలాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారని స్థానికులు గుర్తు చేస్తారు. తరచూ పర్యటనలు, కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఇవే తన బలం ఉన్న ప్రాంతాలుగా రోజా చెప్పుకొనేవారు.నగరి మండలంలో పరిస్థితి మాత్రం సమంగా ఉండేది. అభిమానులు ఉన్నప్పటికీ వ్యతిరేకత కూడా అంతే స్థాయిలో ఉండేది. విజయపురం, పుత్తూరులో అయితే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. అక్కడ వైసీపీ వర్గాలు రెండు గ్రూపులుగా విడిపోయాయి. ఈ పరిణామాలు గత ఎన్నికలకు ముందే మొదలయ్యాయి. అదే సమయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభావం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటం కూడా రోజాకు సవాలుగా మారింది. ఈ కారణాల వల్ల ఆమె నింద్ర, వడమాలపేటలపైనే ఎక్కువగా ఆధారపడినట్టు కనిపించింది.అయితే తాజా రాజకీయ పరిణామాలు ఈ రెండు మండలాల్లో కూడా మార్పు వస్తున్నాయనే సంకేతాలు ఇస్తున్నాయి. ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నియోజకవర్గం అంతటా చురుకుగా పర్యటిస్తున్నారు. తమకు బలం ఉన్న ప్రాంతాలతో పాటు బలహీనంగా ఉన్న మండలాలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టడం ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేయడం, సమస్యలపై వెంటనే స్పందించడం వల్ల ప్రజల్లో ఆయన పట్ల అనుకూలత పెరుగుతోందని అంటున్నారు.ఇదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కూడా ఊపందుకున్నాయి. ఈ పరిణామాల ప్రభావంతో గతంలో రోజాకు అంతో ఇంతో మద్దతు కనిపించిన నింద్ర, వడమాలపేటల్లో ఇప్పుడు ఆమె పర్యటనలకు పెద్దగా స్పందన లేకపోతున్నట్టు చర్చ సాగుతోంది. ఒకప్పుడు కనిపించిన స్వాగతాలు, హడావిడి ఇప్పుడు తగ్గినట్టు స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయిఈ మారుతున్న రాజకీయ సమీకరణలు వచ్చే ఎన్నికల నాటికి ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. నగరి నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు రోజా రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయా? లేక ఆమె మళ్లీ తన పాత బలాన్ని సమీకరించగలుగుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానం కాలమే చెప్పాల్సి ఉంది. కానీ ప్రస్తుతానికి మాత్రం నగరిలో రాజకీయ గాలి మారుతోందన్న మాట వినిపిస్తోంది.

## 'మై బ్రిక్ - మై అమరావతి ' స్ఫూర్తితో..

**విజయవాడ, జనవరి 16, పెన్ పవర్:** అమరావతి నిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి రాజధాని నిర్మాణంలో ప్రజలకు భాగస్వామ్యం కల్పిస్తోంది. ఇందులో భాగంగా రాజధాని అమరావతి నిర్మాణం కోసం విరాళాలు సేకరించాలని నిర్ణయించింది. అమరావతికి విరాళాలు అందించాలనుకునే వారికోసం సీఆర్డీఏ వెబ్ సైట్‌లో క్యూఆర్ కోడ్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అమరావతికి ఆన్‌లైన్ ద్వారా విరాళాలు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీలోని కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని నిర్మాణంలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశంతో విరాళాల సేకరణ ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక డిజిటల్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆన్‌లైన్ ద్వారా విరాళాల సేకరణ ప్రారంభించింది. రాజధాని నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలనుకునే దాతల కోసం ־ూాజ=ణూ తన అధికారిక వెబ్‌సైట్ ఙతీఝ.ఖజూ.స్త్రశీఙ.ఱఅ లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆన్ లైన్ విధానంలో విరాళాల సేకరణ కోసం సీఆర్డీఏ వెబ్‌సైట్‌లో 'ఇశీఅఙవ టశీ ־ూఝతీఝఙఞఱ' అనే ఆప్షన్ తెచ్చారు. ఒక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. అమరావతికి విరాళాలు అందించాలనుకునే దాతలు గూగుల్ పే, ఫోన్ పే లేదా పేటీఎం వంటి ఏదైనా ఖూ× యాప్ ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా సీఆర్డీఏ బ్యాంక్ ఖాతాకు నిధులను పంపవచ్చు.మరోవైపు గతంలోనూ అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. 2015లో రాజధాని నిర్మాణం కోసం'మై బ్రిక్ - మై అమరావతి' కార్యక్రమాన్ని చేపట్టారు. అప్పట్లో ఒక్కో ఈ-ఇటుక ధరను రూ. 10 గా నిర్ణయించగా, సామాన్యుల నుంచి సంపన్నుల వరకు వేలాది మంది స్పందించారు. ఎన్నారైలు సైతం ఈ - ఇటుకలను కొనుగోలు చేసి అమరావతి పట్ల తమ మమకారాన్ని చాటుకున్నారు. ఇప్పుడు మళ్ళీ అదే స్ఫూర్తిని రగిలించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.మరోవైపు ప్రస్తుతం అమరావతిలో తొలి విడత నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అటు కేంద్రం నుంచి, ప్రపంచ బ్యాంకు ద్వారా అమరావతికి రూ. 15,000 కోట్ల నిధులు అందుతున్నాయి. అలాగే ఏడీబీ వంటి బ్యాంకుల నుంచి కూడా రుణాలు స్వీకరిస్తున్నారు. అలాగే ఇటు ప్రజల నుంచి వచ్చే విరాళాలను కూడా రాజధాని మౌలిక సదుపాయాల కోసం వినియోగించనున్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నిర్మిస్తున్న అమరావతి ప్రజా రాజధానికి ప్రజల భాగస్వామ్యం ఉండేలా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది.

## ముందుకు సాగని అక్రమ ఆస్తుల కేసు

**ఒంగోలు, జనవరి 16, పెన్ పవర్:** వైయస్ జగన్మోహన్ రెడ్డి పై సిబిఐ కేసుల విచారణ ప్రారంభం కాలేదు ఎందుకు? తెలుగుదేశం పార్టీ పట్టుబడడం లేదా?? కేంద్రం పట్టించుకోవడం లేదా? జగన్ విషయంలో బిజెపి సానుకూల వైఖరితో ఉందా? పొలిటికల్ వర్గాల్లో ఇదే ఆసక్తికర చర్చ. అయితే జగన్మోహన్ రెడ్డి పై నమోదైన కేసుల విషయంలో జాప్యం జరుగుతుండడం వెనుక.. చట్టంలో ఉన్న లొసుగులే ప్రధాన కారణం. ఎందుకంటే వరుసగా జగన్మోహన్ రెడ్డి విషయంలో డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు అవుతూనే ఉన్నాయి. అందుకే ఈ కేసు విచారణలో తాత్సారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎంత మాత్రం రాజకీయ కోణం లేదన్నది విశ్లేషకుల మాట. తాజాగా దాల్మియా కంపెనీ దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ తో ఇది స్పష్టం అవుతోంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారు అన్నది జగన్మోహన్ రెడ్డి పై ఉన్న ఆరోపణ. దానిపైనే 11 సిబిఐ కేసులతో పాటు తొమ్మిది ఈడీ కేసులు నమోదయ్యాయి. జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ కూడా జరిగింది. దాదాపు 16 నెలల పాటు ఆయన రిమాండ్ ఖైదీగా కూడా ఉండిపోయారు. తరువాత బెయిల్ పై బయటకు వచ్చారు. గత 14 సంవత్సరాలుగా ఆయన బెయిల్ పై బయట ఉన్నారు. కానీ ఆయన కేసులు మాత్రం విచారణకు నోచుకోవడం లేదు. దీనికి డిశ్చార్జ్ పిటిషన్లే కారణమని తెలుస్తోంది. అప్పట్లో ఓ 70 మంది వరకు జగన్మోహన్ రెడ్డి కేసుల్లో నిందితులుగా ఉన్నారు. పేరు మోసిన కంపెనీలు సైతం అప్పుడు క్విడ్ ప్రోలో భాగంగా జగన్మోహన్ రెడ్డి కంపెనీలలో పెట్టుబడులు పెట్టినట్లు సిబిఐ అభియోగాలను మోపింది. అయితే జగన్మోహన్ రెడ్డి కేసులతో తమకు సంబంధం లేదని.. తమ పేరును తొలగించాలని కోరుతూ ఎప్పటికప్పుడు పారిశ్రామికవేత్తలు కోర్టుల్లో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. దాని ఫలితంగానే జగన్మోహన్ రెడ్డి కేసులు విచారణకు రాకుండా ఆగిపోతున్నాయి అనేది సిబిఐ వాదన.దాల్మియా సిమెంట్స్ సంస్థ డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేసింది. తమకు ఎంత మాత్రం జగన్మోహన్ రెడ్డి కేసుతో సంబంధం లేదని కోర్టులో వాదనలు వినిపించింది. అయితే సిబిఐ సైతం గట్టి వాదనలే వినిపించింది. జగన్మోహన్ రెడ్డి కంపెనీలలో దాల్మియా సిమెంట్స్ పెట్టుబడులు పెట్టిందని కోర్టు దృష్టికి తీసుకువెళ్ళింది. భారతి సిమెంట్స్ లో దాల్మియా కంపెనీ పెట్టుబడులు ఉన్నాయని వాదించింది. భారతి సిమెంట్స్ అనేది ముందుగా ఏర్పాటు కాలేదు. రఘురామ సిమెంట్స్ కంపెనీ పేరిట ఉన్న పరిశ్రమను వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్మోహన్ రెడ్డి కొనుగోలు చేశారు. అయితే అంతకు ముందే రఘురామా కంపెనీలో షేర్స్ కొనుగోలు చేసింది దాల్మియా. అయితే తరువాత భారతీ సిమెంట్ సైతం షేర్స్ కొనుగోలు చేసింది. కానీ భారతీయ సిమెంట్స్ కంటే దాల్మియా ఎక్కువ కోడ్ చేసింది. అంటే రఘురామ సిమెంట్స్ ద్వారా ప్రయోజనాలు పొందాలనుకుంది. అయితే అప్పట్లో క్విడ్ ప్రో లో భాగంగానే దాల్మియా 95 కోట్ల రూపాయలు భారతి సిమెంట్స్ లో పెట్టుబడులు పెట్టింది. అయితే అప్పట్లో దాల్మియా సిమెంట్స్ కొన్ని రకాల పెట్టుబడులు పెట్టడం ద్వారా అప్పటి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందింది అన్నది సిబిఐ వాదన. అయితే భారతి సిమెంట్స్ ను ఓ విదేశీ కంపెనీకి విక్రయించారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇంకా ఉత్పత్తి ప్రారంభం కాక మునుపే భారతి సిమెంట్స్ ను 145 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది విదేశీ సంస్థ. అయితే భారతి సిమెంట్స్ లో దాల్మియా కంపెనీ పెట్టిన పెట్టుబడులను ఈ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తంతో సెటిల్ చేశారని చెబుతోంది దాల్మియా. అయితే దీనిపై సీబీఐ కోర్టులో దాల్మియా కంపెనీ డిశ్చార్జ్ పిటిషన్ కొట్టివేతకు గురైతే హైకోర్టును ఆశ్రయిస్తుంది. గత 14 సంవత్సరాలుగా ఇటువంటి డిస్చార్జ్ పిటిషన్లతోనే జగన్మోహన్ రెడ్డి కేసులు పెండింగ్లో ఉండిపోయాయి. అంతే తప్ప దీనికి రాజకీయ కారణాలు లేవు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## గ్రీన్‌లాండ్‌లో డెన్మార్క్ ప్రధాని ఆకస్మిక పర్యటన



**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రీన్‌లాండ్ భవిష్యత్తుపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో డెన్మార్క్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్సెన్ ఎలాంటి ముందస్తు ప్రకటనా లేకుండా శుక్రవారం గ్రీన్‌ల్యాండ్‌కు చేరుకున్నారు. గత 300 ఏండ్లుగా డెన్మార్క్‌లో భాగంగా ఉన్న గ్రీన్‌ల్యాండ్‌కు ఆమె ఆకస్మిక పర్యటన జరిపారు. ఈ పర్యటనలో ఆమె గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్-ఫ్రెడరిక్ నీల్సన్‌తో సుమారు గంట పాటు చర్చలు జరిపారు. అనంతరం రాజధానిలోనీ తీర ప్రాంతం, ఒక కిండర్‌గార్టెన్‌ను సందర్శించి ఇతర స్థానిక అధికారులతో భేటీ అయ్యారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. గ్రీన్‌లాండ్‌ను అమెరికా జాతీయ భద్రతకు కీలకమని పేర్కొంటూ దానిపై తన ఆసక్తిని మళ్లీ వ్యక్తం చేయడం, ఇలాంటి తరుణంలో డెన్మార్క్ ప్రధాని ఆకస్మిక పర్యటన చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా తన పర్యటన ఉద్దేశం గ్రీన్‌ల్యాండ్‌లో నివసిస్తున్న సుమారు 57 వేల మందికి భరోసా ఇవ్వడమేనని ఫ్రెడరిక్సెన్ తెలిపారు. "గ్రీన్‌లాండ్ ప్రజలకు డెన్మార్క్ పూర్తి మద్దతు ఉన్నదని చూపేందుకే నేను ఇక్కడికి వచ్చాను" అని ఆమె అన్నారు. రెండు ప్రభుత్వాల మధ్య సన్నిహిత సమన్వయం అవసరమని చెప్పారు.

## కూలిన విమానం? రన్ వే పై జెట్ తలకిందులు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 8 మందితో వెళుతున్న ప్రైవేటు జెట్ ఈశాన్య రాష్ట్రమైన మైనేలోని బాంగోర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కుప్పకూలిపోయింది. ప్రమాదం జరగగానే మంటలు ఎగిసిపడటంతో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఆదివారం సాయంత్రం 7 గంటల 45 నిముషాలకు మైనేలోని బాంగోర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అవుతుండగా బాంబార్డియర్ ఛాలెంజర్ 600 విమానం కూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో 8 మంది ఉన్నారు. ప్రమాదం జరగగానే ఎమర్జెన్సీ ప్రకటించారు. వెంటనే రన్ వేను మూసేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, ప్రయాణికుల జాడ గురించి ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు. విమానం హోస్టన్ కు చెందిన ఒక కంపెనీపై రిజిస్టర్ అయినట్లుగా సమాచారం. ప్రస్తుతం ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విమానాశ్రయంలో శిథిలాల నుంచి పొగలు పైకి లేస్తున్నాయి.

## ఇండోనేషియాలో ఆకస్మిక వరదలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండోనేషియాలోని పశ్చిమ జావా ప్రావిన్స్‌లో ఆకస్మిక వరదల కారణంగా ఏడుగురు మరణించారు. వందలాది మంది గల్లంతయ్యారు. స్థానిక కాలమానం ప్రకారం శనివారం తెల్లవారు జామున 3:30 గంటల సమయంలో వెస్ట్ బాండుంగ్ రీజన్‌లోని సిసరువా సబ్-డిస్ట్రిక్ట్‌లో ఈ విపత్తు సంభవించింది. పసిర్కునింగ్, పసిర్ కుడా గ్రామాలపై కొండచరియలు విరిగిపడ్డంతో పాటు ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. దీంతో వచ్చిన బురద, మట్టి ప్రవాహంలో గ్రామంలోని అనేక ఇళ్లు కొట్టుకునిపోయాయి. సమాచారం తెలుసుకున్న రెస్క్యూ బృందాలు అక్కడకుని చేరుకుని సహాయక కార్యక్రమాలు ప్రారంభించాయి. ఆదివారం ఉదయానికి ఏడు మృతదేహాలను వెలికితీశాయి. ఇంకా వందలాది మంది గ్రామస్తుల ఆచూకి కోసం గాలింపు జరుగుతోంది. వీరంతా బురదలో చిక్కుకపోవడం లేదా గల్లంతైవుంటారని అధికారలు భావిస్తున్నారు. క్లిష్టమైన భూభాగం, కొండచరియలు విరిగిపడే ప్రమాదం కారణంగా రెస్క్యూ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు ఈ ప్రాంతంలో మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

## ఫ్రాన్స్ కస్టడీలోకి రష్యన్ ట్యాంకర్ కెప్టెన్

**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్యధరా సముద్రంలో స్వాధీనం చేసుకున్న అనుమానిత రష్యన్ 'షాడో ఫ్లీట్' ఆయిల్ ట్యాంకర్ కెప్టెన్‌ను విచారణ నిమిత్తం ఫ్రాన్స్ ఆదివారం తమ కస్టడీలోకి తీసుకొంది. ఈ ఓడకు సంబంధించిన భారతీయ కెప్టెన్‌ను న్యాయ అధికారులకు అప్పగించారు. ఓడ సిబ్బందిలోనూ భారతీయులు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఉక్రెయిన్‌పై తాను చేస్తున్న యుద్ధానికి సంబంధించిన ఆంక్షల నుంచి తప్పించుకోడానికి రష్యా 400 నౌకల సముదాయాన్ని ఉపయోగిస్తున్నట్లు భావిస్తున్నారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఫ్రాన్స్ తదితర దేశాలు పట్టుదలతో ఉన్నాయి. ట్యాంకర్ కెప్టెన్, సిబ్బంది సహకరించేందుకు నిరాకరిస్తున్న కారణంగా ఫిబ్రవరిలో విచారణ జరపనున్నట్లు ఫ్రెంచ్ జ్యుడీషియల్ అధికారులు వెల్లడించారు.

## బ్రిటన్‌లో ఎఫ్‌బీఐ తరహా పోలీసు విభాగం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉగ్రవాదం, మోసం, ముఠా హింసకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు కోసం కొత్తగా ఒక జాతీయ పోలీసు సర్వీసును ఏర్పాటు చేయనున్నట్లు బ్రిటన్ హోంమంత్రి షబానా మహమూద్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి నైపుణ్యం కలిగినవారితో ఈ విభాగం ఏర్పాటవుతుందని వివరించారు. ఇది అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) తరహాలో ఉంటుంది. ఈ విభాగం అధికారుల వద్ద అధునాతన పరిజ్ఞానం అందుబాటులో ఉంటుంది. దీని సాయంతో ప్రమాదకరమైన నేరగాళ్లను పట్టుకుంటారు. ఈ కొత్త విభాగం ఏర్పాటుతో నేషనల్ క్రైమ్ ఏజెన్సీ (ఎన్‌సీఏ), ప్రాంతీయ స్థాయి వ్యవస్థీకృత నేర దర్యాప్తు విభాగాలు ఒకే గొడుగు కిందకి వస్తాయి. ఈ మేరకు ప్రతిపాదనలను షబానా సోమవారం పార్లమెంటు ముందుంచుతారు. ప్రస్తుత వ్యవస్థలో స్థానిక అధికారులకు సంక్లిష్టమైన ఆధునిక నేరాలపై దర్యాప్తు చేయడానికి అవసరమైన నైపుణ్యాలు, వనరులు ఉండటంలేదని ఆమె పేర్కొన్నారు.

## అమెరికా చెప్పినవన్నీ అబద్ధాలే



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నుంచి అమెరికా నిష్క్రమణపై ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయెసస్ కీలక ప్రకటన చేశారు. తమ సంస్థ నుంచి వైదొలగడానికి దారితీసిన కారణాలపై అమెరికా చేసిన ప్రకటనలో వాస్తవికత లేదని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద ఈ పరిణామం అమెరికాకు, ప్రపంచ దేశాలకు సురక్షితమైంది కాదన్నారు. భవిష్యత్తులో మళ్లీ డబ్ల్యూహెచ్‌వోలో అమెరికా చేరి క్రియాశీల పాత్రను పోషిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' వేదికగా టెడ్రోస్ ఓ ట్వీట్ చేశారు. కరోనా వ్యాప్తిపై డబ్ల్యూహెచ్‌వో సకాలంలో తమకు సమాచారాన్ని అందించలేదని అమెరికా ప్రభుత్వం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ జాప్యం వల్ల అమెరికాలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. ఈ మేరకు జనవరి 22న అమెరికా ఆరోగ్య మంత్రి కెనడీ జూనియర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. తాజాగా దీనికి డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ కౌంటర్ ఇచ్చారు. అమెరికా సర్కారు ప్రకటనపై డబ్ల్యూహెచ్‌వో అధికారిక స్పందనతో కూడిన నోటిఫికేషన్‌ను కూడా ఈ పోస్ట్‌కు జతపరిచారు.

# ద్వైతమత బోధకులు మధ్వాచార్యులు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దేశ నాగరికతకు మతము జీవకర్ర వంటిది. మతత్రయాచార్యులలో, వైష్ణవమత బోధకులలో అగ్రగణ్యులైన శ్రీమధ్వాచార్యులు ఒకరు. త్రిమతాచార్యులలో మూడవ వారై, హనుమంతుడు, భీముడు, అనంతరం వాయు దేవునకు తృతీయ అవతారంగా భావించే మధ్వాచార్యులు ద్వైత మత బోధకులు. ఆయన సాంప్రదాయా లను పాటించే వారిని మాధ్యులు లేదా మధ్వ మతస్తులు అంటారు. క్రీ.శ.1238 ఆశ్వయుజ మాస శుక్ల పక్ష దశమి (విజ యదశమి) నాడు ఆయన కొంకణ - కేరళ మధ్యనున్న కనరా మండలంలోని ఉడిపి పట్టణ సమీపస్థ పాజక క్షేత్రంలో మధ్య గేహభట్ట, వేదవతి దంపతులకు జన్మించారు. ఉడిపిలోని అనంతేశ్వర స్వామిని చిరకాలం కొలిచిన ఫలితంగా జన్మించి నందున ఆయనకు వాసుదేవుడని తల్లిదండ్రులు పేరు పెట్టారు. అనంతర కాలంలో "పూర్ణప్రజ్ఞ, ఆనందతీర్థ, మధ్వాచార్య" అనే నామాలతో ప్రసిద్ధులైనారు. 8వ ఏట ఉపనయన సంస్కారియై, 10ఏళ్లకే సర్వ విద్యా పారంగతుడైనారు. 11ఏళ్ల వయసులో సన్యాసంవైపు ఆకర్షితులై, అచ్యుత ప్రజ్ఞ అనే యతివర్యులైన ఆధ్యాత్మిక గురువు వద్ద సన్యాసాశ్రమాన్ని స్వీకరించి, "పూర్ణబోధ" పేరు నంది అనే గొప్ప పండితుని ఓడించి "మధ్వ, పూర్ణ ప్రజ్ఞుడు" బిరుదులు పొందారు. వేదాంత విద్యా రాజ్య పట్టాన్ని పొంది "అనంద తీర్థులు నామాంచి తులైనారు. యుక్త వయసు లోనే దక్షిణ భారతావనిలో కన్యాకుమారి, రామేశ్వరం, శ్రీరంగం తదితర క్షేత్రాలను సందర్శించారు. తాము పొందిన తత్వజ్ఞానాన్ని ఉపన్యాస రూపంలో ప్రజలకు వివరించారు. శ్రీశంకర భగవత్పాదుల ప్రస్థాన త్రయానికి ఒనర్చిన భాష్యాలను మధ్వాచార్య విమర్శించారు. దక్షిణ దిగ్విజయ యాత్ర గావిస్తూ, తమ ముఖ్య శిష్యుడైన సత్యతీర్థులతో కలిసి బదరి యాత్ర చేశారు. ఆ సందర్భంలోనే బ్రహ్మ సూత్రాలపై భాష్యాలను పూర్తి చేశారు. స్వదేశానికి తిరిగి వస్తూ రాజమహేంద్ర వరంలో శ్యామశాస్త్రి (నరహరితీర్థులు)ని మాయావాదం గురించి ఓడించి, ప్రచండవాదం గావించి, శిష్యుడిని చేసుకున్నారు. అలాగే అక్కడే శోభనభట్టు (పద్మనాభ తీర్థులు) అనే పండితుడు శిష్యుడైనాడు. ఉడిపిలో భగవద్గీత, ఉపనిషత్తులకు భాష్యాలు రాసారు. రుగ్వేదంలోని 40 సూక్తాలకు,భారత భాగవతాలకు వ్యాఖ్యానాలు రచించారు. శ్రీకృష్ణామృత మహార్ణవం కర్మనిర్ణయం, మహా భారత తాత్పర్యం లాంటి అనేక గ్రంథ రచనలు గావించారు. తర్కంతో పాటు 37 గ్రంథాలను విరచించారు. జీవిత కాలంలో ఆనందానుభూతి పొందగల సులభతరమైన భక్తిమార్గాన్ని ఆయన బోధించారు. అందుకే ఆయనకు ఆనంద తీర్థులన్న నామధేయం బహుళ ప్రచారంలో ఉంది. భక్తి జ్ఞాన వైరాగ్యాలతోపాటు కర్తవ్య కర్మ ఆచరణ ద్వారా శ్రీచరణాలు చేరవచ్చునని మార్గదర్శనం చేశారు. "జీవుడు వేరు, బ్రహ్మము వేరు. జీవుడు మిథ్య కాదు. అలాగే జడ జగత్తు కూడా మిథ్య కాదు. ఈశ్వరుడు ఎంత సత్యమో జీవజగత్తులు కూడా అంత సత్యం. భక్తి ఒక్కటే ముక్తిదాయకం. అది జ్ఞానపురస్కృతమైన భక్తి అయి ఉండాలి. ముక్తి నాలుగు విధాలు: సాలోక్యం? జీవాత్మ భగవంతుని లోకంలో భగవంతునితోపాటు నివసించడం; సామీప్యం ? భగవంతుని సన్నిధానంలో నివసిస్తూ కామితార్థాలను అనుభవించడం; సారూప్యం ? భగవంతుని రూపం పొంది ఇష్టభోగాలు అనుభవిస్తూ ఆనందించడం; సాయుజ్యం ? భక్తుడు భగవంతునిలో లీనమైనా ఆయన కంటే వేరుగా ఉంటూనే ఆయన ఆనందంలో పాలుపంచు కోవటం. జగత్తు మాయా మాత్రమే. జీవితం ప్రత్యక్ష ప్రామాణికమే. పరమాత్మ సర్వస్వతంత్రుడు, జీవాత్మ అస్వతంత్రుడు. జీవోత్తముడు ఆచార్యుడు. ధర్మమార్గంలో, ఆచార్యుల అనుగ్రహం సంపాదించి, అర్థమైన ఆనందాన్ని అనుభవించమని ఆయన చెప్పిన సూక్తి ముక్తావళి మధ్వులకు శిరోధార్యం.మధ్వాచార్య ఆసేతు హిమాచల పర్యంతం పర్యటించి, ద్వైతమత విస్తృత ప్రచారం గావించి, వైష్ణవ మత వ్యాప్తికి, ప్రధానంగా కృష్ణభక్తి వ్యాప్తికి మధ్వమతం ద్వారా ఇతోధికంగా కృషి సల్పారు. భీమసేనుని అవతారమని భావించే ఆయన వృకోదరత్వాన్ని పలుమార్లు ప్రదర్శించి, విష్ణు మంగళ గ్రామాన 200 అరటి పళ్ళను ఆరగింప ప్రార్థితులై అలవోకగా తినివేశారు. ఇషుపాతమనే మరో గ్రామంలో 1000 అరటి పళ్ళు తెచ్చిఇవ్వగా, అన్నింటినీ ఒకే ఊపులో ఆరగించారు. అడవి మార్గాన సంచరిస్తుండగా, పొదలనుండి వచ్చి, శిష్యుని మీద దూకిన పులిని ఒకే గుద్దుతో హత మార్చారు. కదూరా మండలంలోని ముద్ర గ్రామ సమీప తుంగభద్రా నదీతీరాన అంబుతీర్థమనే ప్రదేశాన ఒడ్డునుండి నదిలోనికి అడ్డంగాపడి ఉన్న పెద్ద బండరాయిని చూసి, విషయం కనుగొని, అవలీలగా ఒక్క చేతితో ఎత్తి అనుకున్న స్థలంలో అనువు పరిచారు. ఆయన అతిలోక బల సామర్థ్యానికి నిదర్శనంగా, ఆ బండ మీద (శ్రీ మధ్వాచార్యైరేక హస్తేన ఆనీయ స్థాపిత శిలా"అనే అక్షరాలు చెక్కబడినవై ఉన్నాయి. తమ 79వ ఏట క్రీ.శ.1817లో మాఘశుక్ల నవమి నాడు శిష్య సమేతులై బదరీ నారాయణుని దర్శించి, ఉత్తర బదిరిని ఒంటరిగా చేరి, వ్యాస భగవానుని కైంకర్యాలలో నిమగ్నమైనారు.

# సాటిలేని మేటి..విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయన కంఠస్వరం సుమధురమైంది. స్వచ్ఛమైన ఉచ్ఛారణ ఆయన కంఠంలో ఒదిగి పోయింది. వేదవాఙ్మయ ఔన్నత్యాన్ని సుస్వరంగా, లయబద్ధంగా విశ్వానికి వ్యక్తీకరించిన సనాతన సాంప్రదాయ ప్రతీక ఆయన. నిత్య ప్రాతః స్మరణం చేసుకోవాల్సిన మహానుభావుడు, మహా పురుషుడు."వేదం వింటే విధాత సమక్షంలో వినాలి, లేదంటే బ్రహ్మశ్రీ జగన్నాధ ఘనపాఠి నోటవినాలి" అంటూ శ్రీశ్రీశ్రీ దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధిపతులయిన శ్రీ మదభినవ విద్యాతీర్థస్వామి జగద్గురువులచే ప్రశంసింప బడిన కారణ జన్ములు. ఆయనే విద్యా వాచస్పతి, ఘనాలంకార, ఘనపాటి చక్రవర్తి, వేద సమ్రాట్, విశ్వనాథ జగన్నాధ ఘనపాఠి.ప్రముఖ వేద పండితులైన విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి... బ్రహ్మశ్రీ సుబ్బావధానులు, శ్రీమతి సుబ్బమ్మ దంపతులకు విశాఖపట్నం జిల్లా, చోడవరం తాలూకా, చిన్ననందిపల్లి అగ్రహారంలో సౌమ్య పుష్య బహుళ విదియనాడు (జనవరి 27, 1910) జన్మించారు. రాజోలు సమీపంలోని నరేంద్రపురంలో బ్రహ్మశ్రీ రాణి సుబ్బావధానులు దగ్గర కూడా కొంతకాలం శిష్యరికం చేసారు. ఆయన వేదం చెబుతుంటే మళ్ళీ మళ్ళీ వినాలనిపించేదని పలువురి ప్రశంసలు అందుకున్నారు. పిన్నవయస్సులోనే ఆదిభట్ల నారాయణదాసు దగ్గర లయబద్ధంగా వేదస్వస్తి చెప్పి, ప్రశంసలు అందుకున్నారు. ఎక్కడైనా వేదసభలు జరుగుతుంటే అందరితో కలసి జగన్నాధ ఘనపాఠి వేదస్వస్తి చెప్పేవారు. అక్కడున్న వేద పండితులంతా కనీసం ఒక ఘనా పనసైనా చెప్పాలని పట్టుబట్టేవారు. భారత తొలి రాష్ట్రపతి డా.బాబూ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా 1961 జూలై 2న "విద్యా వాచస్పతి" పురస్కారం అందుకున్న ఘనపాఠి. అలా ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ఆనాటి రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, డా జాకీర్ హుస్సేన్, వి. వి. గిరి, డా. శంకర్ దయాళ్ శర్మ, నాటి ప్రధాన మంత్రులు ఇందిరా గాంధీ, పి. వి. నరసింహారావు అలాగే డా. కె.ఎల్.రావు వంటి ప్రముఖుల చేత సత్కారాలు పొందారు. శృంగేరీ జగద్గురువులు శ్రీ మదభినవ విద్యా తీర్థులవారు "ఘనాలంకార" బిరుదుతో సత్కరించగా, శ్రీ శ్రీ శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి చేతుల మీదుగా "ఘనపాఠి చక్రవర్తి" బిరుదుతో సన్మానం అందు కున్నారు. విజయ నగరం వేద పరిషత్ "వేద సమ్రాట్" బిరుదుతో సత్కారం చేయగా, సువర్ణ పతకంతో శృంగేరి శారదా పీఠాధిపతులు, సువర్ణ హారంతో కంచి కామకోటి పీఠాధిపతి సన్మానించారు. సువర్ణ గండ పెండేరంతో విశాఖ వేద శాస్త్ర పరిషత్ సత్కరించింది. రాజమహేంద్రవర పుర వాసులు 1964లో జగన్నాథ ఘనపాఠికి సువర్ణ ఘంటా కంకణ సన్మానం చేసారు. 1970లో పద్మ భూషణ్ ఉప్పులూరి గణపతి శాస్త్రి ఆధ్వర్యాన ఘనపాఠి షష్టిపూర్తి మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. 1975లో రాష్ట్ర ప్రభుత్వం నుండి "పండిత పురస్కారం" అందుకున్నారు. శ్రీ రామభక్త గానసభ ఆధ్వర్యాన బ్రహ్మశ్రీ విశ్వనాధ జగన్నాధ ఘనపాఠికి "కనకాభిషేకం" చేయగా, 1991 జనవరి 2న రాజమండ్రి పురపాలక సంఘం పౌర సన్మానం చేసి, గౌరవించింది. అదేరోజు ఘనపాఠికి "సహస్ర చంద్ర దర్శన మహోత్సవం" పురవాసులు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ లో నిర్వహించిన ప్రపంచ తొలి తెలుగు మహాసభలు జగన్నాధ ఘనపాఠి "వేదస్వస్తి" తోనే శుభారంభ మయ్యాయి. ఇందిరాగాంధి ప్రధానిగా వుండగా, పెద జీయర్ స్వామి డిల్లీలో నిర్వహించిన అఖిల వేదశాఖా సమ్మేళనంలో ఘనపాఠి పాల్గొని, లయబద్ధమైన వేద స్వస్తితో అందరి ప్రశంసలు పొందారు. రాజమండ్రి వేదశాస్త్ర పరిషత్ తో పాటు, విజయవాడ, టి టి డి వేద శాస్త్ర పరిషత్ లు నిర్వహించే పరీక్షలకు "పరీక్షాధికారి"గా వ్యవహరించారు . కాశీలో శ్రీ రాజేశ్వర శాస్త్రి ద్రవిడ అధ్యక్షతన జరిగిన వేద సభలలో పాల్గొని, వేద వాఙ్మయంలో ఓలలాడించారు. ఇక 1958 ఫిబ్రవరిలో శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఘన స్వస్తి ప్రారంభించి, 40 రోజుల పాటు నిర్వహించడమే కాక, పండితులందరికీ సువర్ణ కుండలాలతో సత్కారం చేయించిన ఘనత ఘనపాఠి వారిదే. బ్రహ్మశ్రీలు గుళ్ళపల్లి వెంకట నారాయణ ఘనపాఠి, చిట్టి సుబ్రహ్మణ్య ఘనపాఠి , శ్రీపాద శ్రీరామ నృసింహ ఘనపాఠి , ఈమని రామకృష్ణ ఘనపాఠి వంటి ఉద్దండులతో ఈ ఘన స్వస్తిలో జగన్నాధ ఘనపాఠి పాలుపంచు కున్నారు. శృంగేరీ జగద్గురువులు శ్రీ మదభినవ విద్యా తీర్థుల వారితో కలసి "కాశ్మీర్ యాత్ర" సాగించారు. యావద్భారతదేశంలో పర్యటించి, వేద ప్రచారం గావించిన ఘనపాఠి వారికి ఎందఱో శిష్యులున్నారు. బ్రహ్మశ్రీలు గోలి కొండావధానులు, అయ్యల సోమయాజుల సుబ్బావధానులు, యడవల్లి రమణావధానులు వంటి వారంతా శిష్యగణంలో వారే. టిటిడి "వేద పారాయణ స్కీం పర్యవేక్షకుని"గా కొంతకాలం సేవలందించిన ఘనపాఠి 1994 ఆగస్టు27 శ్రావణ బహుళ షష్టి శనివారం తెల్లవారు ఝామున మహాభి నిష్క్రమణం (మరణం) చేసారు. 2010, జనవరి 2వ తేదిన ఘనాలంకార బ్రహ్మశ్రీ విశ్వనాధ జగన్నాధ ఘనపాఠి "శత జయంతి సభ" రాజమహేంద్రవరం టిటిడి కల్యాణ మంటపంలో నిర్వహించారు. ఆయన పేరిట వేద శాస్త్ర పరిషత్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ప్రతియేటా కృష్ణాష్టమికి వేదసభ నిర్వహించి, పండిత సత్కారం చేస్తున్నారు.

# అలనాటి మేటి నటి జమున

**హైదరాబాద్ పెన్ పవర్:** జనాభాయి అనే పేరు తెలిసిన వారు ఎవరూ ఉండక పోవచ్చు. అలాగే జూలూరి జమున గురించి కూడా ఎవరికీ తెలియక పోవచ్చు. ఈ రెండు పేర్లు తెలుగు సినిమా రంగానికి చెందిన ఒక అగ్ర శ్రేణి కథానాయకురాలికి సంబంధించినవే అంటే ఔరా అనిపించక మానదు. అంతే కాదు. ఆమె తెలుగు మాతృభాష కాకపోయినా తెలుగు నేలలో పెరిగి, తెలుగు చలన చిత్ర సీమలో అరుదైన కథానాయికగా గుర్తింపు పొందిన తార అంటే ఆశ్చర్యం కలుగ మానదు. ఆమే అర్ధ శతాబ్దం క్రితం సినీ రంగంలో కాలూని, వెండి తెరపై నడయాడి, ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన లిజెండ్, జూలూరి జమున లేదా జమునా రమణారావు లేదా జమునగా సుపరిచితురాలు అయిన ఒకనాటి తెలుగు మేటి సినీ నటి. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో హీరోయిన్లుగా కొనసాగిన వాళ్లు చాలా మందే వున్నారు. కేవలం కొంతమంది మాత్రమే తమ నటనా ప్రతిభతో సుధీర్ఘ కాలం పరిశ్రమలో, ప్రేక్షకుల్లో తమదైన ముద్రలను వేసుకున్నారు. అలాంటి ప్రతిభ గల మేటి పారతరం తారల్లో జమున ఒకరు. జమున 1936 ఆగష్టు 30 న హంపీలో పుట్టారు. ఆమె తల్లి కౌసల్యాదేవి తండ్రి వ్యాపారవేత్త నిప్పని శ్రీనివాసరావు. బాల్యం గడిచింది గుంటూరు జిల్లా దుగ్గిరాలలో. జమునకు ముందుగా పెట్టిన పేరు జనాభాయి. జన్మ నక్షత్రం రీత్యా ఏదైనా నది పేరు ఉండాలని జ్యోతిష్కులు సూచించడంతో మధ్యలో 'ము' అక్షరం చేర్చి జమునగా మార్చారు. ఉత్తరాది వారు యమునను జమునగా పిలవడం నేపథ్యంగా ఆమెకు ఆ పేరు స్థిరీకరించారు. సినిమా కోసం ప్రత్యేకంగా ఆమె పేరు మార్చలేదు. సినీనటుడు జగ్గయ్యదీ అదే గ్రామం కావడం వల్ల జమున కుటుంబానికి జగ్గయ్యతో కొంత పరిచయం ఉంది. సహజంగా బెరుకు అంటూ లేని జమున స్కూలులో చదివే కాలంలో నాటకాల పట్ల ఆకర్షితురాలు కావడం జరిగింది. బాల్యంలోనే జమున సంగీతంలో కూడా శిక్షణ తీసుకున్నారు. ఆమె నటనకు ఎన్నో అవార్డులు సైతం లభించాయి. తెనాలి సమీపంలోని మండూరు గ్రామంలో 'ఖిల్జీ రాజ్య పతనం ' అనే నాటిక ప్రదర్శన కోసం ప్రత్యేకంగా జగ్గయ్య, జమునను ఎంపిక చేసుకుని తీసుకు వెళ్ళారు. ఆ నాటికలో మరో ప్రముఖ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు కూడా నటించారు. అలా నాటకాలలో ఆమె ప్రతిభ బహిర్గతమై నలుమూలలకూ తెలవడం వల్ల సినిమా అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. బి.వి.రామానందం తీసిన పుట్టిల్లు ఆమె తొలిచిత్రం. తరువాత అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, నందమూరి తారక రామారావు తదితర నటుల సరసన నాయికగా నటించారు. ఎన్ని పాత్రలలో నటించినా ఆమెకు బాగా పేరు తెచ్చింది సత్యభామ పాత్రే. ఆ పాత్రలో ఇప్పటికీ ఆమెను తప్ప మరొకరిని ఊహించు కోలేము అన్నట్టుగా అద్భుతంగా నటించారామె. వినాయక చవితి చిత్రంలో మొదటి సారి సత్యభామ పాత్రలో జమున కనిపిస్తుంది. ఆ తర్వాత శ్రీకృష్ణ తులాభారం చిత్రంలో కూడా అదే పాత్ర వేశారు. ఈ సినిమాలో సత్యభామ ఆహార్యం గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా లోని పాత్రే ఆమెకు గొప్ప పేరు తెచ్చింది. ప్రధానంగా "మీర జాల గలడా నా యానతి" పాటపై సత్యభామలోని అన్ని లక్షణాలు కలబోసుకుని చేసిన ఆమె అభినయం, ఇప్పటికీ కళ్లముందు కదలాడుతూనే ఉంటుంది. సత్యభామ అంటే ఇలాగే వుంటుంది అనే భావన కలిగించారు జమున. కళపై ఉన్న మక్కువతో నాటకాల్లో బుర్రకథ ఫేం నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం తన నట జీవితానికి పట్టం కట్టిందని చెపుతారు. సినీ నటీమణుల్లో , రాజకీయాలలో ప్రవేశించి రాణించిన కథానాయికలలో ఆమె తమ స్థానాన్ని పదిల పరచుకొన్నారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ అంటే ఉన్న అభిమానం, గౌరవం నన్ను రాజకీయాలలోకి లాక్కొచ్చాయి అని తన రాజకీయ జీవితం గురించి చెప్పేవారు జమున. ఆమె తెలుగు సినిమాలే కాక తమిళం, హిందీ సినిమాలలో కూడా నటించారు. ఆమె నటించిన మిస్సమ్మ, ఇల్లరికం, ఇలవేల్పు, లేత మనసులు, గుండమ్మ కథ చిత్రాలు విజయ వంతమై, రజతోత్సవాలు జరుపు కున్నాయి.

జమున చిన్నతనం నుండే నాటకాలలో నటించే వారు. జమున తల్లి ఆమెకు శాస్త్రీయ సంగీతం, హార్మోనీయంలలో శిక్షణ ఇప్పించారు. మా భూమి నాటకంలో జమున ఒక పాత్ర పోషించగా, ఆమె అభినయం నచ్చి ఆమెకు పుట్టిల్లు (1953)లో నటిగా అవకాశం ఇచ్చారు. ఆ సినిమాతో సినిమాల లోకి తెరంగేట్రం చేశారామె. తెలుగు, దక్షిణ భారత భాషల్లో కలిపి ఆమె 198 సినిమాలు చేశారు. పలు హిందీ సినిమాలలో కూడా నటించారు. 1967లో ఆమె హిందీలో చేసిన మిలన్ సినిమా, 1964లో విడుదలైన మూగ మనసులు సినిమాలకు గాను ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు లభించింది. తెలుగు ఆర్టిస్ట్ అసోసియేషన్ అనే సంస్థ నెలకొల్పి 25 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారామె. 1980లలో కాంగ్రెస్ పార్టీలో చేరి రాజమండ్రి నియోజకవర్గం నుంచి 1989లో లోక్ సభకు ఎంపిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రాజకీయల నుండి తప్పుకున్నా, 1990వ దశకంలో భారతీయ జనతా పార్టీ తరఫున ప్రచారం చేశారు. 1968లో ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు - మిలన్; 1964లో ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు - మూగ మనసులు; తమిళనాడు రాష్ట్ర చలన చిత్ర గౌరవ పురస్కారం 1999, 2008లలో ఎన్.టి.ఆర్ జాతీయ పురస్కారం పొందారు. 89ఏళ్ల జమున వృద్యాప్త సంబంధిత వ్యాధులతో బాధపడుతూ 2023 జనవరి 27న హైదరాబాద్‌లోని స్వగృహంలో కన్నుమూశారు.

# రాజస్థాన్‌లో 10వేల కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

**హైదరాబాద్ పెన్ పవర్:** రిపబ్లిక్ డే వేళ ఇంటెలిజెన్స్ అధికారులు స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు రాజస్థాన్‌లో 10వేల కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. నాగౌర్ జిల్లాలోని ఓ ఫామ్‌హౌస్‌లో స్మగ్లింగ్ నెట్‌వర్క్ పని చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఫామ్‌హౌస్‌పై దాడి చేయగా.. 187 బస్తాల అమ్మోనియం నైట్రేట్‌తో పాటు డిటోనేటర్లు, డిటోనేటర్ వైర్లు, ఇతర పేలుడు పదార్థాలు లభ్యమైనట్లు తెలిపారు. వీటిని అక్రమ మైనింగ్‌లో వాడుతున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. సులేమాన్‌ఖాన్ అనే వ్యక్తి అరెస్ట్ చేసి, విచారణ చేపట్టామన్నారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు నిందితుడు

ఈ పేలుడు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటి విలువ రూ.కోట్లలో ఉంటుందన్నారు. నిందితుడిపై గతంలోనూ పేలుడు పదార్థాల సరఫరాకు సంబంధించి పలు కేసులు నమోదయ్యాయన్నారు. ఇప్పటివరకు ఈ పేలుడు పదార్థాలను ఎవరెవరికి సరఫరా చేశారు, ఇందులో ఇతర రాష్ట్రాల ముఠాలకు కూడా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# ఎల్ఐసి అద్భుతమైన పాలసీ!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ పథకంలో వైఎంఎన్ లిక్విడిటీని కూడా పరిగణనలోకి తీసుకుంది. మీకు ఆర్థిక అవసరం ఉంటే రెండేళ్ల తర్వాత పాలసీపై రుణం తీసుకోవచ్చు. 18, 50 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తులు ఈ పథకాన్ని పొందవచ్చు. ప్రపంచంలో ప్రతి ఒక్కరూ భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకోవాలని కోరుకుంటారు. కష్టపడి సంపాదించిన డబ్బును సరైన స్థలంలో పెట్టుబడి పెట్టే విషయానికి వస్తే, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దేశంలో అత్యంత విశ్వసనీయ పేరుగా నిలిచింది. మార్కెట్లో అందుబాటులో ఉన్న అనేక ఎంపికలలో ఒఎఅ జీవన్ ఆనంద్ (ప్లాన్ నం.915) పాలసీ తక్కువ ప్రీమియంతో పొదుపు, రక్షణ రెట్టింపు ప్రయోజనాన్ని కోరుకునే వారికి అద్భుతమైన ప్లాన్. ప్రీమియంలు చాలా ఖరీదైనవి అవుతాయనే భయంతో మనం తరచుగా బీమా పథకాలను వాయిదా వేస్తాము. అయితే, జీవన్ ఆనంద్ పాలసీ లెక్కలు సామాన్యుల బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. గణాంకాలను పరిశీలిస్తే, ఇది చాలా సరసమైనదిగా అనిపిస్తుంది. ఉదాహరణకు మీరు 35 సంవత్సరాల వయస్సు గలవారైతే, రూ.5 లక్షల బీమా మొత్తాన్ని ఎంచుకుంటే, 35 సంవత్సరాల కాలానికి మీ వార్షిక ప్రీమియం సుమారు రూ.16,300 ఉంటుంది. మీరు ఈ మొత్తాన్ని నెలవారీగా లెక్కిస్తే అది దాదాపు రూ.1,400 అవుతుంది. రోజుకు రూ.45 నుండి రూ.46 వరకు మాత్రమే ఆదా చేయాలి. ఈ చిన్న మొత్తాన్ని క్రమశిక్షణతో పొదుపు చేయడం వల్ల మెచ్యూరిటీ సమయంలో గణనీయమైన మొత్తం లభిస్తుంది. ప్రస్తుత బోనస్ రేట్ల ఆధారంగా పాలసీ మెచ్యూరిటీ సమయంలో మీరు దాదాపు రూ.2.5 మిలియన్ల మొత్తాన్ని అందుకుంటారు. ఇందులో మీ ప్రాథమిక హామీ మొత్తం రూ.5 మిలియన్లు, వెస్టెడ్ సింపుల్ రివిజనరీ బోనస్‌లు, తుది అదనపు బోనస్ ఉన్నాయి. దీని అర్థం చిన్న పొదుపులతో మీరు మీ వృద్ధాప్యానికి కూడా గణనీయమైన ప్రయోజనం ఉంటుంది. ఈ పాలసీ అతిపెద్ద లక్షణం ఏమిటంటే దీనిని ఇతర ప్లాన్‌ల నుండి ప్రత్యేకంగా ఉంచుతుంది. సాధారణంగా, బీమా పాలసీలు వ్యవధి ముగిసిన తర్వాత మరియు చెల్లింపు అందిన తర్వాత గడువు ముగిసిపోతాయి. అయితే, జీవన్ ఆనంద్ విషయంలో ఇది జరగదు. రూ. 25 లక్షల మెచ్యూరిటీ మొత్తాన్ని చేరుకున్న తర్వాత కూడా మీ బీమా కవర్ గడువు ముగియదు. పాలసీదారు జీవితాంతం రూ. 5 లక్షల రిస్క్ కవర్ కొనసాగుతుంది. అంటే మెచ్యూరిటీ మొత్తాన్ని అందుకున్న సంవత్సరాల తర్వాత పాలసీదారుడు మరణించినప్పుడల్లా (100 సంవత్సరాల వయస్సులో కూడా), వారి కుటుంబానికి లేదా నామినీకి రూ. 5 లక్షల ప్రత్యేక మొత్తాన్ని ఇస్తారు.

# మధ్యప్రాచ్యానికి మారిన భారత చమురు కొనుగోళ్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ ముడి చమురు కొనుగోలు విధానాల్లో మార్పులు చేస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా చమురు కొనుగోలు క్లిష్టంగా మారిన నేపథ్యంలో భారత్ ఇప్పుడు సురక్షితమైన వనరులను ఎంచుకుంటోంది. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ డేటా ప్రకారం, రష్యన్ ముడి చమురు దిగుమతి జనవరి మొదటి మూడు వారాల్లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది, ఇది గత నెలలో సగటున 1.21 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది. 2025 మధ్యలో 2 మిలియన్ బ్యారెళ్లతో పోలిస్తే దిగుమతులు గణనీయంగా తగ్గాయి. ఈ క్రమంలో భారత్ ఇరాక్, సౌదీ అరేబియా వంటి మధ్యప్రాచ్య దేశాల నుంచి ఎక్కువ చమురును కొనుగోలు చేయడం ప్రారంభించింది. ఇరాక్ ఇప్పుడు రష్యా మాదిరిగానే దాదాపు అదే మొత్తంలో చమురును సరఫరా చేస్తోంది. మరోవైపు, సౌదీ అరేబియా ఎగుమతులు కూడా బాగా పెరిగాయి. 2022 నుంచి చౌక ధరల కారణంగా రష్యా భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా మారినప్పటికీ, ఇటీవలి ఆంక్షలు షిప్పింగ్, బీమా, చెల్లింపులను మరింత క్లిష్టతరం చేశాయి. దీని కారణంగా, భారత శుద్ధి సంస్థలు రష్యన్ చమురును కొనుగోలు చేయడంలో ఎక్కువ జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి.

# త్వరలో యాపిల్ డిజిటల్ చెల్లింపుల సేవలు ప్రారంభం



**హైదరాబాద్ పెన్ పవర్:** డిజిటల్ చెల్లింపులకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. ప్రధానంగా యూపీఐ లాంటి డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ కారణంగా లావాదేవీలు అత్యంత సులభంగా, త్వరగా జరుగుతున్నాయి. అయితే, ఈ విభాగంలో దేశీయంగా ఇప్పటికీ గూగుల్, మెటా, అమెజాన్ లాంటి గ్లోబల్ కంపెనీలు, ఫోన్‌పే, పేటీఎమ్, భారత్‌పే లాంటి దేశీయ చెల్లింపుల యాప్‌ల హవా జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో గ్లోబల్ టెక్ దిగ్గజం, ఐఫోన్ బ్రాండ్‌కు చెందిన యాపిల్ కూడా భారత డిజిటల్ చెల్లింపుల మార్కెట్లోకి అడుగుపెట్టాలని భావిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తరహాలోనే ఇతర కంపెనీల కంటే బాగా ఆలస్యంగా ఇందులోకి ప్రవేశిస్తోంది. ప్రస్తుతానికి యాపిల్ పేని భారత్‌లో ప్రారంభించేందుకు యాపిల్ కంపెనీ బ్యాంకులు, క్రెడిట్ కార్డు కంపెనీలు, ఎన్‌పీసీఐ, ఆర్‌బీఐతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. యాపిల్ పే మొదట డెబిట్, క్రెడిట్ కార్డులకు అనుమతించాలని భావిస్తోంది. ఆ తర్వాత ప్రభుత్వ ఆమోదం పొందిన తర్వాత యూపీఐ చెల్లింపులను యాడ్ చేసే అవకాశం ఉంది. అన్ని ప్రక్రియలు విజయవంతమైతే ఈ ఏడాది ఆఖరు నాటికి డిజిటల్ చెల్లింపుల సేవలను ప్రారంభించవచ్చని తెలుస్తోంది.

## దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఘోర ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 300 మందికి పైగా ప్రయాణికులు, సిబ్బందితో వెళ్తున్న ఒక ఫెర్రీ (ప్యాసింజర్ పడవ) సోమవారం తెల్లవారుజామున సముద్రంలో మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 13 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. మరోవైపు, సహాయక బృందాలు 244 మందిని సురక్షితంగా కాపాడగలిగాయి. జాంబోంగా నగరం నుంచి సులు ప్రావిన్స్‌లోని జోలో ద్వీపానికి ఈ ఫెర్రీ బయలుదేరింది. మార్గమధ్యలో బాసిలన్ ప్రావిన్స్‌లోని బలుక్‌బలుక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే కోస్ట్‌గార్డ్ యూనిట్లు, నౌకలు, సమీపంలోని మత్స్యకారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకు 13 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి సంఖ్య ఇంకా కచ్చితంగా తెలియరాలేదు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదని, దీనిపై దర్యాప్తు జరుపుతామని అధికారులు తెలిపారు. జాంబోంగా పోర్టు నుంచి బయలుదేరే ముందు కోస్ట్ గార్డ్ అధికారులు ఫెర్రీని తనిఖీ చేశారని, అప్పుడు ఓవర్‌లోడింగ్ సంకేతాలు ఏవీ లేవని స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ గాలి, సముద్ర మార్గాల ద్వారా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు తగ్గాయ్




**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈనెల తొలి 3 వారాల్లో సగటున రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్ల చమురు మాత్రమే దిగుమతి అయ్యింది. 2025 డిసెంబరులో రోజుకు 1.21 మి.బ్యారెళ్ల చమురు దిగుమతి అయ్యింది. గతేడాది మధ్యలో చూస్తే రోజుకు 2 మి.బ్యారెళ్ల చొప్పున ముడిచమురును రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకుందని విశ్లేషణా సంస్థ కెప్లర్ వెల్లడించింది. దేశీయ ముడిచమురు అవసరాల్లో 90 శాతాన్ని మనదేశం దిగుమతి చేసుకుంటోంది. ఇక్కడి రిఫైనరీల్లో దీన్నుంచి పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలను ఉత్పత్తి చేస్తుంటారు. పాశ్చాత్య దేశాల ఆంక్షలు తీవ్రమవ్వడంతో.. డిసెంబరు నుంచి రష్యా ముడిచమురు దిగుమతులను మనదేశం వ్యూహాత్మకంగా తగ్గించుకుంటూ వస్తోంది. పశ్చిమాసియాలోని సంప్రదాయ సరఫరాదార్ల నుంచి మనదేశం దిగుమతులు పెంచుకుంటోంది. కెప్లర్ డేటా ప్రకారం, ఇరాక్ ఇప్పుడు రష్యా స్థాయిలో మనకు ముడిచమురు సరఫరా చేస్తోంది. 2025 డిసెంబరులో సగటున రోజుకు 9,04,000 బ్యారెళ్ల చమురును ఇరాక్ సరఫరా చేసింది. సౌదీ అరేబియా నుంచి చమురు దిగుమతి పరిమాణం ఈ నెలలో రోజుకు సగటున 9,24,000 బ్యారెళ్లకు చేరింది. డిసెంబరులో ఇది 7,10,000 బ్యారెళ్లుగా ఉంది. 2025 ఏప్రిల్‌లో కనిష్ఠంగా 5,39,000 బ్యారెళ్లుగా నమోదైంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభించిన రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, 2022 నుంచి భారీ తగ్గింపు ధరకు ముడిచమురును మనకు రష్యా ఆఫర్ చేసింది. అప్పటివరకు మనదేశానికి ముడిచమురును ఇరాక్ అధికంగా సరఫరా చేసేది. దాన్ని అధిగమించి మన దేశానికి అత్యధికంగా ముడి చమురు సరఫరా చేసే దేశంగా రష్యా నిలిచింది. 2022కు ముందు మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% కంటే తక్కువ కాగా, ఈ పరిణామాల్లో అది గరిష్ఠంగా సుమారు 40 శాతానికి చేరింది. రష్యా సరఫరాదార్లపై అమెరికా మరిన్ని ఆంక్షలను డిసెంబరులో విధించడంతో, మన కొనుగోళ్లు మందగించాయి.

# సంచలన నిర్ణయం.. టీసీఎల్ చేతికి సోనీ టీవీలు..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఎలక్ట్రానిక్స్ ప్రపంచంలో ఒక పెద్ద సంచలనం వచ్చింది. టీసీఎల్, సోనీ కలిసి జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. అయితే ఇక సోనీ టీవీలు టీసీఎల్ చేతిలోకి వెళ్లిపోతున్నాయి. అయితే ఈ ఒప్పందం కుదిరినా.. ఎప్పట్లాగే వాటి బ్రాండ్లు కొనసాగనున్నాయని ప్రకటించాయి. వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ ప్రపంచంలో ఒక పెద్ద సంచలనంలో సోనీ గ్రూప్ కార్పొరేషన్ తన టీవీ వ్యాపారాన్ని విభజించాలని ప్రణాళికలు ప్రకటించింది. కంపెనీ తన హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో 51 శాతం వాటాను చైనీస్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎఅఒ ఎలక్ట్రానిక్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు విక్రయిస్తోంది. మిగతా 49 శాతం సోనీకి ఉంటుంది. ఈ మైలురాయి ఒప్పందం తర్వాత రెండు కంపెనీలు జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తాయి. ఇది ఏప్రిల్ 2027లో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ చర్య జపనీస్ కంపెనీలు తక్కువ లాభదాయక టెలివిజన్ హార్డ్‌వేర్ విభాగంపై ఆధారపడటంలో మార్పును ప్రతిబింబిస్తుంది. సోనీ ఇప్పుడు తన దృష్టిని సాంప్రదాయ ఎలక్ట్రానిక్స్ నుండి ప్లేస్టేషన్ వంటి అధిక-వృద్ధి, మరింత లాభదాయక విభాగాలకు మారుస్తోంది. భవిష్యత్ టీవీలు 'సోనీ', 'బ్రావియా' బ్రాండింగ్‌ను నిలుపుకుంటాయి. ఈ ఏర్పాటు ప్రపంచ మార్కెట్లో తన బలమైన బ్రాండ్ ఉనికిని కొనసాగించడానికి, టీవీ తయారీకి సంబంధించిన అధిక ఖర్చులు, తక్కువ లాభదాయకత సవాళ్లను తగ్గించడానికి సహాయపడుతుందని సోనీ చెబుతోంది. సోనీ అధ్యక్షుడు, అఖా కిమియో మాకి ప్రకారం, వినియోగదారులకు మరింత మెరుగైన వీక్షణ అనుభవాన్ని అందించడానికి రెండు కంపెనీల నైపుణ్యాన్ని మిళితం చేయడమే ఈ భాగస్వామ్యం లక్ష్యమన్నారు. ఈ వ్యూహాత్మక ఒప్పందంలో టిఎన్‌పై ఈ జాయింట్ వెంచర్‌కు నాయకత్వం వహిస్తుంది. 51% మెజారిటీ వాటాను కలిగి ఉంటుంది. స్థిరమైన వృద్ధికి ఈ భాగస్వామ్యాన్ని బలమైన పునాదిగా ఎఅఒ ఛైర్మన్ డు జువాన్ అభివర్ణించారు. ఈ ఒప్పందం సోనీ హార్డ్‌వేర్ ఆధారిత వ్యాపార నమూనా నుండి సాఫ్ట్‌వేర్, సేవల ఆధారిత వ్యాపార నమూనాకు మారడానికి సహాయపడుతుందన్నారు. టీసీఎల్, సోనీ కలిసి జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నా.. ఎప్పట్లాగే వాటి బ్రాండ్లు కొనసాగనున్నాయని ప్రకటించాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముడవుతున్న సోనీ, టీసీఎల్ టెలివిజన్లు అలాగే అమ్మకానికి ఉంటాయి. టీవీ సెగ్మెంట్ నుంచి సోనీ బయటకు వెళ్లిపోవట్లేదు. కానీ నేరుగా ఇకపై ఈ టీవీల వ్యాపారాన్ని సోనీ నిర్వహించదని చెబుతున్నారు. ఈ బాధ్యత టీసీఎల్ చూసుకుంటుంది. అయితే సోనీ బ్రాండ్ ముఖ్యంగా బ్రావియా టీవీలు, హోమ్ ఆడియో ఉత్పత్తులకు కస్టమర్ కేర్ అంతా టీసీఎల్ చూసుకోనున్నట్లు తెలుస్తోంది. టెక్నాలజీ, ఇతరత్రా అంశాల్లో సోనీ మద్దతు టీసీఎల్‌కు ఉంటుందని తెలుస్తోంది.

# యూపీఐ యాప్స్ వాడేటప్పుడు ఈ తప్పులు చేస్తున్నారా..?




**హైదరాబాద్ పెన్ పవర్:** యూపీఐ యాప్స్ వాడుతున్నారా..? అందులో లభించే యూపీఐ క్రెడిట్‌ను తెగ వాడేస్తున్నారా..? అయితే మీరు అప్పుల్లో చిక్కుకోవడం గ్యారంటీ. చిన్న షాపుల దగ్గర రూ.10, రూ.20 అని క్రెడిట్‌ను వాడుకుంటే ఆర్థిక భారం పెరుగుతుంది. నెల చివరి నాటికి అది మరింత భారమవుతుంది. ఈ రోజుల్లో ప్రతీఒక్కరూ యూపీఐ యాప్‌లు వాడుతున్నారు. స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్న వారందరి ఫోన్లల్లో యూపీఐ యాప్‌లు ఖచ్చితంగా ఉంటున్నాయి. ప్రస్తుత మార్కెట్లో అనేక యూపీఐ ఫ్లాట్‌ఫామ్స్ ఉన్నాయి. అనేక కంపెనీలు కొత్తగా మరికొన్ని యాప్స్‌ను తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. దేశంలో యూపీఐ యాప్స్ వాడకం నానాటికి పెరుగుతూనే ఉంది. ప్రతీ ఏడాది రికార్డు స్థాయిలో యూపీఐ ట్రాన్సాక్షన్లు పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. సెకన్ల వ్యవధిలోనే బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడం, పేమెంట్స్ చేయడం వంటి సౌకర్యాలు ఉండటంతో బ్యాంకు వినియోగదారులందరూ యూపీఐ యాప్స్ వాడుతున్నారు. బ్యాంకులు స్వయంగా తమ మొబైల్ బ్యాంకింగ్ యాప్స్‌లో యూపీఐ సౌకర్యం అందుబాటులోకి తెస్తున్నాయి. అయితే యూపీఐ ద్వారా మనం పేమెంట్స్ చేయాలన్నా లేదా వేరే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నా మన అకౌంట్లో డబ్బులు ఉండాలి. కానీ అకౌంట్లో డబ్బులు లేకపోయినా వినియోగదారులు పేమెంట్స్ చేసేందుకు వీలుగా క్రెడిట్ లైన్‌ను జారీ చేస్తున్నాయి యాప్‌లు. అంటే యాప్‌లే అప్పుగా డబ్బులు ఇస్తున్నాయి. చాలామంది ఈ ఫెసిలిటీని వాడుకుంటున్నారు. కొంతమంది వీటికి అలవాటు క్రెడిట్ లైన్‌ను విపరీతంగా ఉపయోగించుకుంటున్నారు. చిన్న చిన్న దుకాణాల వద్ద కాకుండా ఏదైనా అవసరాలకు వీటి ద్వారానే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్ చేస్తున్నారు. ఇలాంటి చిన్న పేమెంట్స్ వల్ల నెల చివరి నాటికి ఆర్థిక భారం పెరుగుతుంది. దీంతో దీని వల్ల అప్పుల ఊబిలోకి వెళ్లే అవకాశముందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. క్రెడిట్ లైన్‌ను ఎక్కువగా వాడుకోవద్దని హెచ్చరిస్తున్నారు.

## చైనాతో ఒప్పందం చేసుకుంటే.. వంద శాతం సుంకాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** చైనాతో ఒప్పందం కుదుర్చుకుంటే కెనడాపై వంద శాతం సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగారు. 'కెనడా కనుక చైనాతో ఒప్పందం కుదుర్చుకుంటే అమెరికాలో ప్రవేశించే దాని వస్తువులు, ఉత్పత్తులు అన్నింటిపై తక్షణమే వంద శాతం సుంకాలు అమల్జేస్తాం' అని ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అయితే చైనాతో ఏ ఒప్పందం కుదుర్చుకుంటే కెనడాపై సుంకం విధించేదీ ఆయన తెలియజేయలేదు. చైనాతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నామని కెనడా ప్రధాని కార్నే గత వారం ప్రకటించారు. సుంకాలను తగ్గించేందుకు ఆయన అంగీకరించారు. ఆ సమయంలో ట్రంప్ దానిపై వ్యాఖ్యానిస్తూ 'అది మంచి పని' అంటూ ప్రశంసించారు. అయితే గత కొద్ది రోజులుగా అమెరికా, కెనడా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. అమెరికా నేతృత్వంలోని ప్రపంచ క్రమం చీలిపోయిందని దావోస్‌లో చేసిన ప్రసంగంలో కార్నే వ్యాఖ్యానించారు. అగ్ర రాజ్యాల ఆర్థిక ఒత్తిడుల నేపథ్యంలో 'మిడిల్ పవర్స్' (అగ్ర రాజ్యాల తర్వాతి స్థానంలో ఉంటూ నిర్ణయాత్మక ప్రభావం చూపే భారత్, బ్రెజిల్, ఇండోనేషియా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ వంటి దేశాలు) ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని కూడా సూచించారు. దీనిపై ట్రంప్ ఆ మర్నాడు ఘాటుగా స్పందిస్తూ అమెరికా కారణంగానే కెనడా మనుగడ సాగిస్తోందని చెప్పుకొచ్చారు. గాజా శాంతి బోర్డులో చేరాల్సిందిగా కెనడాకు పంపిన ఆహ్వానాన్ని కూడా ఆయన వెనక్కి తీసుకున్నారు. చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి తామేమీ వెంటపడలేదని కెనడా వాణిజ్య మంత్రి డొమినిక్ లిబ్లాంక్ చెప్పారు. అనేక ముఖ్యమైన టారిఫ్ అంశాలను పరిష్కరించుకున్న తర్వాతే ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలతో వాణిజ్య భాగస్వామ్యాలు నెలకొల్పుకోవాలని భావిస్తున్నామని అన్నారు. ట్రంప్ విధిస్తున్న సుంకాల కారణంగా నెలకొన్న అనిశ్చితిని దృష్టిలో పెట్టుకొని అమెరికాతో వాణిజ్య సంబంధాలకు దూరం కావాలని కెనడా యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే గత వారం కార్నే, చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది.

# మసకబారిన పాత్రలను మెరిపించే చిట్కాలు!



మన సంప్రదాయంలో పూజా కార్యక్రమాలకు ఇత్తడి వస్తువులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే, నిత్యం దీపారాధన, ధూపం వేయడం వల్ల ఈ పాత్రలు క్రమంగా నల్లగా మారి తమ సహజ మెరుపును కోల్పోతుంటాయి. మసకబారిన ఈ వస్తువులను మళ్ళీ కొత్తవాటిలా మార్చడానికి వంటింట్లో దొరికే సహజ సిద్ధమైన పదార్థాలు అద్భుతంగా పని చేస్తాయి. వీటిని సరైన పద్ధతిలో శుభ్రం చేయడం వల్ల పూజా గది ఎప్పుడూ దైవకళతో ఉట్టిపడుతుంది. ముందుగా, చింతపండు గుజ్జుతో ఇత్తడి పాత్రలను శుభ్రం చేయడం అనేది కాలం కాలంగా వస్తున్న అత్యుత్తమ మార్గం. చింతపండులో ఉండే సహజమైన యాసిడ్ గుణాలు ఇత్తడిపై పేరుకుపోయిన ఆక్సీకరణను తొలగించి, దానికి తక్షణమే పసిడి వర్ణాన్ని అద్ది మెరిపిస్తాయి. చింతపండు గుజ్జును పాత్రలన్నింటికీ పట్టించి కాసేపు ఉంచి, ఆపై రుద్దడం వల్ల మొండి జిడ్డు వదిలిపోయి పాత్రలు తళతళలాడుతాయి.మరింత మొండిగా ఉన్న నల్లటి మచ్చలను వదిలించుకోవడానికి సున్నం, ఉప్పు మరియు వెనిగర్ మిశ్రమాన్ని ఉపయోగించవచ్చు. ఈ మూడింటినీ కలిపి ఒక పేస్టులా తయారుచేసి, పాత్రలపై ఉన్న మరకలపై మెత్తని స్క్రబ్బర్‌తో సున్నితంగా రుద్దాలి. ఈ మిశ్రమం లోతైన మలినాలను సైతం శుభ్రం చేసి, ఇత్తడికి ఒక ప్రత్యేకమైన కాంతిని ఇస్తుంది. దీనివల్ల పాతబడిపోయిన పాత్రలు కూడా మళ్ళీ పుత్తడిలా మెరవడం ప్రారంభమవుతాయి. పాత్రలను తోమడం పూర్తయ్యాక, వాటిని కేవలం చల్లటి నీటితో కాకుండా వేడినీటితో శుభ్రం చేయడం చాలా ముఖ్యం. వేడినీరు పాత్రలపై మిగిలి ఉన్న జిడ్డును పూర్తిగా తొలగిస్తుంది. కడిగిన వెంటనే తేమ లేకుండా పొడి వస్త్రంతో తుడిచి ఆరబెడితేనే నీటి చుక్కల మచ్చలు పడకుండా ఉంటాయి. ఈ చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే మీ ఇంట్లోని పూజా సామాగ్రి ఎల్లప్పుడూ కొత్తవాటిలా మెరుస్తూ, ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తాయి.

# బుక్స్ చూస్తే జంకుతున్న జెన్-జి






'పుస్తకం హస్త భూషణం.. మస్తిష్క మధనానికి సరియైన సాధనం. మదనపడే మదికి దివ్య ఔషధం అన్నారు' ఒక కవి. ఎందుకంటే మానవుల్లో అజ్ఞానమనే చీకటిని తొలగించే దీపాలే పుస్తకాలు. అలాంటి అజ్ఞాన తిమిరాన్ని తరిమే పుస్తక పఠనం ఇప్పుడు కనుమరుగైపోతోంది. ముఖ్యంగా ఈ తరం యువత లో బుక్ రీడింగ్ అలవాటు గణనీయంగా తగ్గిపోయింది. పుస్తకాలు చదివే ఓపిక, తీరిక ఎవరికీ ఉండకపోగా కనీసం డిజిటల్‌గా లభించే కథలు, నవలలు కూడా ఒక్కసారైనా చదివే సాహసం చేస్తున్న ధాఖలాలు కనిపించట్లేదు. అయితే దీనిపై టెక్నాలజీ ఎఫెక్ట్ ఉంది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, టిక్ టాక్, ఇతర వేదికల్లో తక్షణ ఆనందానికి అలవాటు పడిన యువతరం.. రీల్స్, షార్ట్ వీడియోలకే మొగ్గు చూపుతున్నారు. కేవలం 30 సెకన్లలో లభించే ఫన్ కోసం తహతహలాడే మనస్తత్వానికి అలవాటు పడి.. కొన్ని గంటలపాటు కూర్చొని బుక్ రీడింగ్ చేయడం ఒక టార్చర్‌లా ఫీల్ అవుతున్నారు. దీనివల్ల యూత్‌లో ఏకాగ్రత గణనీయంగా తగ్గిపోతోందని, భవిష్యత్తు తరాలు ప్రమాదంలో పడే ఛాన్స్ ఉందని ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్తలు, ప్రొఫెసర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

షార్ట్ కట్: సాంకేతిక పరిజ్ఞానం పెరగటం, సమాచారం కోసం ఎఐ వంటి సులభమైన పద్ధతుల కారణంగా ఈ తరం విద్యార్థులు, యువత లోతైన అంశాలను విశ్లేషణ చేసేందుకు ఇష్టపడట్లేదు. నెమ్మదిగా లైన్ బై లైన్ చూడకుండా కేవలం తమకు కావాల్సిన సమాచారాన్ని కోసం పఠనాన్ని పరిగెత్తిస్తున్నారని, పాఠాలు, కథలు, నవలలు, రచనలపై సుదీర్ఘమైన పరిశోధన చేయలేకపోతున్నారని పలువురు టీచర్లు చెబుతున్నారు. రచయిత ఏం చెప్పారో, ఆ సారాంశం అంతరార్థం ఏమిటో కూడా గ్రహించలేకపోతున్నారని, క్లిష్టమైన వాక్య నిర్మాణాలను అర్థం చేసుకోవడాన్ని కష్టంగా ఫీల్ అవుతున్నారని గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటి జనరేషన్ విద్యార్థుల పఠన నైపుణ్యాలు బలహీనంగా ఉంటున్నాయని, పాఠ్యాంశ సారాంశం తెలియకుండానే డిగ్రీపట్టాలు అందుకోవడం నిజంగా బాధకరమని, ఇది విద్యా వ్యవస్థకు మంచిదికాదని అధ్యాపకులు హెచ్చరిస్తున్నారు.

డిజిటల్ డిస్ట్రబెన్స్: ప్రస్తుతం పుస్తకాల్లో అక్షరాలను చూడటం కంటే స్క్రీన్లను చూసేందుకే బ్రెయిన్ అలవాటు పడిపోతోంది. దీనివల్ల మెదడులో విశ్లేషణాత్మకమైన భావాలకంటే ఎమోషనల్ ఫీలింగ్స్ ఉత్తేజితమవుతున్నాయని ప్రొఫెసర్లు చెబుతున్నారు. కొంతమంది బుక్ రీడింగ్ చేస్తున్నా సరే.. పక్కన మొబైల్, ట్యాబ్ పెట్టుకోవడం వల్ల అందులో వచ్చే నోటిఫికేషన్లు కాన్సన్ట్రేషన్‌ను దెబ్బతీస్తున్నాయని, దీనివల్ల కూడా విద్యార్థుల్లో మేధోపరమైన పరిణితి, భాషా నైపుణ్యం తగ్గిపోతుందంటున్నారు. డిజిటల్ కంటెంట్ కారణంగా కొత్త పదాలు, వ్యాకరణంపై పట్టుకోల్పోవడం, విమర్శనాత్మక ఆలోచన లోపించడం, ఒక విషయాన్ని పలు కోణాల్లో విశ్లేషించే శక్తి లేకపోవడం, సహనం కోల్పోవడం, సుదీర్ఘమైన పనులను పట్టుదలతో పూర్తి చేసే ఆసక్తి మందగించడం జరుగుతున్నాయని ఇప్పటికే పలు సర్వేల్లో వెల్లడైనట్లు నిపుణులు పేర్కొన్నారు.

జెన్ –జీ 5శాతమే: 'గడిచిన పదేళ్లలో బుక్ రీడింగ్ అలవాటు 40% తగ్గింది. 2025లో దాదాపు సగం మందికిపైగా అమెరికన్లు ఒక్క పుస్తకం తెరవలేదు. ముఖ్యంగా 18–29 సంవత్సరాల వయస్సు గల అమెరికన్లు సగటున 5.8 బుక్స్ మాత్రమే కంప్లీట్ చేశారు. జనరేషన్ జెడ్ ఇందులో చాలా వెనుకబడి ఉంది. కొంతమంది విద్యార్థులు తరగతి గదిలో ఒక్క వాక్యం కూడా చదవడానికి ఇష్టపడరు. విమర్శనాత్మక చర్చలో పాల్గొనడానికి ఇబ్బంది పడుతున్నారు. 50% మంది అయిష్టంగా చదివేవారుగా కనిపిస్తున్నారు' అని కాలిఫోర్నియాలోని పెప్పర్‌డైన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జెస్సికా హూటెన్ వివరించారు. ఈ క్రమంలోనే విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని, తాము పెద్ద పెద్ద పాఠ్యపుస్తకాలకు బదులుగా చిన్న చిన్న స్లైడ్స్ లేదా సమ్మరీ నోట్స్ ఇస్తున్నామని తెలిపారు. అయితే కొంతమంది పిల్లలను చదివేలా ప్రోత్సహించిన తర్వాత వారు మరింత ఆత్మవిశ్వాసంతో కనిపించారని, పిల్లలను తమంతట తాముగా విమర్శనాత్మకంగా ఆలోచించగలిగేలా చేయడటమే పేరెంట్స్, టీచర్లు లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.

# కిడ్నీలో రాళ్లు.. ఈ టిప్స్‌తో చెక్ !






కిడ్నీలోని రాళ్లు.. పెద్ద సమస్య కాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల ఈ సమస్యను మొదట్లోనే పరిష్కరించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన కిడ్నీల్లో రాళ్లను కరిగించే లేదా బయటికి పంపించే సులభ మార్గాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో కిడ్నీలలో రాళ్లు అనేది సాధారణంగా మారిపోయింది. మారుతన్న జీవనశైలి, తీసుకునే ఆహారం, తదితర కారణాలతో చాలా మంది కిడ్నీలో రాళ్ల సమస్యను ఎదుర్కొంటున్నారు. రాళ్లు పెద్దవిగా ఉంటే కిడ్నీ ప్రాంతంలో తీవ్రమైన నొప్పి వస్తుంది. అందుకే కిడ్నీలోని రాళ్లు.. పెద్ద సమస్య కాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల ఈ సమస్యను మొదట్లోనే పరిష్కరించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన కిడ్నీల్లో రాళ్లను కరిగించే లేదా బయటికి పంపించే సులభమైన మార్గాలు ఉన్నాయి. మనం తీసుకునే ఆహారం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్యను తగ్గించవచ్చని వైద్యారోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

1. రోజూ సరిపడా నీరు తాగండి: నీటితో నీరు తాగడం వల్ల మూత్రం సాఫీగా వస్తుంది. మూత్రంలో ఖనిజాల సాంద్రత తగ్గుతుంది. డాక్టర్ సూచన ప్రకారం రోజుకు కనీసం 2.5 లీటర్ల వరకు నీరు తాగడం మంచిది. నీరు తాగడం ద్వారా చిన్న క్రిస్టల్స్(రాళ్లు) పెద్దవికాక ముందే బయటకు పోతాయి, అందువల్ల రాళ్ల సమస్య కూడా తగ్గుతుంది. 2. ఉప్పు తక్కువగా తీసుకోండి: ఎక్కువ సోడియం (ఉప్పు) ఉండే ఆహారం తీసుకుంటే కిడ్నీలు మీ శరీరంలో ఉన్న కాల్షియం ఎక్కువగా మూత్రంలో రిలీజ్ చేస్తాయి. ఈ కాల్షియం కిడ్నీ స్టోన్స్ ఏర్పాటు చేసుకోవడానికి కారణం కావచ్చు. అందుకే ఉప్పు ఒక్క చెంచా (సుమారు 5 గ్రాముల) కంటే ఎక్కువ తీసుకోవద్దు. పరిశోధనలు కూడా ఉప్పు తగ్గించడం వల్ల రాళ్ల సమస్య తగ్గిందని చెబుతున్నాయి.

3. సిట్రేట్లు ఉన్న పండ్లు ఎక్కువగా తినండి: నిమ్మకాయ, ఆరెంజ్, మోసంబి వంటి సిట్రేట్ పండ్లు కిడ్నీ స్టోన్స్ ఏర్పడకుండా నిరోధిస్తాయి. సిట్రేట్ కల్పించే ఆహారం కాల్షియాన్ని క్రిస్టల్ రూపంలో ఉండకుండా, మూత్రంలో కదలికగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉదాహరణకి, నిమ్మరసం నీటిలో కలిపి ఉదయం మధ్యలో తాగటం చాలా మంచిది. కేవలం ఇవే కాకుండా.. ఆక్సలేట్ ఎక్కువగా ఉండే ఆహారాలు (టమాట, పాలకుర, బీట్ రూట్ వంటి) ని పరిమితం చేయండి. ఎక్కువ రెడ్ మీట్ లేదా అధిక ప్రోటీన్ ఆహారం తగ్గించండి (యూరిక్ యాసిడ్ తగ్గిస్తుంది). నీటితో పాటు నిమ్మకాయ కలిపిన నీటిని రోజులో ఎక్కువసార్లు తీసుకోండి.

## బీపీ, పీరియడ్స్‌కు మధ్య ఉన్న సంబంధం ఏంటీ?




రక్తపోటు సమస్య అనగానే మనం సాధారణంగా గుండె లేదా మెదడుకు సంబంధించిన వ్యాధుల గురించే ఆలోచిస్తాం. కానీ ఈ నిశ్శబ్ద శత్రువు మహిళల అంతర్గత ఆరోగ్యంపై, ముఖ్యంగా నెలసరి ప్రక్రియపై ఎంతటి తీవ్ర ప్రభావం చూపుతుందో తెలుసా? బీపీ పెరిగినా, తగ్గినా అది కేవలం రక్తనాళాలకే పరిమితం కాదు.. అది హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీసి, పీరియడ్స్ ఆగిపోయేలా లేదా అధిక రక్తస్రావం అయ్యేలా చేస్తుంది. అధిక రక్తపోటు లేదా హైపర్‌టెన్షన్ వల్ల శరీరంలోని కీలకమైన హార్మోన్లు అసమతుల్యతకు గురవుతాయి. ముఖ్యంగా ఆల్డోస్టెరాన్, కార్టిసాల్, అడ్రినలిన్, థైరాయిడ్ వంటి హార్మోన్ల స్థాయిలో మార్పులు రావడం వల్ల పీరియడ్స్ క్రమరహితంగా మారే అవకాశం ఉంది.రక్తనాళాలపై ప్రభావం: అధిక రక్తపోటు గర్భాశయం, అండాశయాలకు రక్తాన్ని చేరవేసే ధమనులను దెబ్బతీస్తుంది. దీనివల్ల నెలసరి సమయంలో రక్త ప్రవాహం పెరిగి అధిక రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది. అంతేకాదు ఒకవేళ బిపి సమస్య తీవ్రమైతే గర్భాశయ ధమనులు కుంచించుకుపోయి, పీరియడ్స్ శాశ్వతంగా ఆగిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ పరిస్థితిని వైద్య పరిభాషలో అమెనోరియా అని పిలుస్తారు. ఇది ఒక రకమైన ముందస్తు మెనోపాజ్ వంటిది. గుండె, మూత్రపిండాలు, మెదడు వంటి అవయవాలు సజావుగా పనిచేయాలన్నా.. ఋతుచక్రం సక్రమంగా ఉండాలన్నా రక్తపోటును అదుపులో ఉంచుకోవడం తప్పనిసరి. క్రమం తప్పకుండా బీపీ చెకప్ చేయించుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా ఈ సమస్యల నుండి బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

## జీవనశైలిలో ఈ మార్పులే గుండెకు శ్రీరామరక్ష!



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో అనారోగ్యం దరిచేరకుండా ఉండాలంటే జీవనశైలిలో మార్పులు తప్పనిసరని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం పాటించే సరైన అలవాట్ల వల్ల దాదాపు 90 శాతం జబ్బులను దరిచేరకుండా నియంత్రించవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. కేవలం మందుల ద్వారానే కాకుండా, క్రమశిక్షణతో కూడిన దినచర్యను అలవరచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శారీరక శ్రమ అత్యంత కీలకమైన అంశం. వారానికి కనీసం మూడు నుండి నాలుగు సార్లు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీనితో పాటు ప్రతిరోజూ 10 వేల అడుగుల నడకను లక్ష్యంగా పెట్టుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యలు దరిచేరవు. నడక అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది శరీరంలోని ప్రతి అవయవానికి పునరుత్తేజాన్ని ఇచ్చే ఒక అద్భుతమైన ప్రక్రియ. శరీరానికి అవసరమైన శక్తిని అందించడంలో నిద్ర, సూర్యరశ్మి ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి నిద్రపోవడం వల్ల మెదడు చురుగ్గా పని చేయడమే కాకుండా, శరీర కణాలు మరమ్మత్తుకు గురవుతాయి. ఉదయాన్నే లేత ఎండలో కొద్దిసేపు నిలబడటం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్–డి అందుతుంది. ఇది ఎముకల పుష్టికి, రోగనిరోధక శక్తి పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుంది.మనం తీసుకునే ఆహారం, నీరు మన ఆరోగ్యానికి పునాదులు వంటివి. ప్రతిరోజూ పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన ప్రోటీన్లు, విటమిన్లు అందుతాయి. అలాగే రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు తాగడం వల్ల శరీరంలోని మలినాలు బయటకు వెళ్లిపోయి, చర్మం మరియు అంతర్గత అవయవాలు శుద్ధి చేయబడతాయి. వీటన్నింటితో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రతిరోజూ ధ్యానం (మెడిటేషన్) చేయడం ఎంతో అవసరం.

## పసిపిల్లల్లో జలుబు లక్షణాలు.. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే!



పసిపిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా వాతావరణం మారినప్పుడు శిశువుల శరీరంలో వచ్చే మార్పులను నిశితంగా గమనించాలి. చిన్నపిల్లలకు జలుబు చేసినప్పుడు వారి చేతులు, కాళ్లు సాధారణం కంటే ఎక్కువగా చల్లగా మారుతుంటాయి. చర్మం పాలిపోయినట్టుగా కనిపించినా లేదా అక్కడక్కడా కొద్దిగా నీలం రంగులోకి మారుతున్నా, అది వారి శరీర ఉష్ణోగ్రత పడిపోవడానికి సంకేతమని గుర్తించాలి. సాధారణంగా జలుబు చేసినప్పుడు ముక్కు కారడం మాత్రమే కాకుండా, ముక్కు పూర్తిగా మూసుకుపోయి పసిబిడ్డలు ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడతారు. ఇలాంటి సమయంలో వారు ఏడుస్తున్నప్పుడు శ్వాస వేగం అసాధారణంగా పెరుగుతుంది. తరచుగా తుమ్ములు రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం వంటివి కనిపిస్తే సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు అర్థం చేసుకోవాలి. కేవలం సాధారణ జలుబే కదా అని అశ్రద్ధ చేయడం ఏమాత్రం మంచిది కాదు.శిశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉన్నప్పుడు వారిలో రోగనిరోధక శక్తి తగ్గే అవకాశం ఉంటుంది. చర్మం రంగు మారడం లేదా శ్వాసలో ఇబ్బందులు కలగడం వంటివి అంతర్లీనంగా ఉన్న ఇతర ఆరోగ్య సమస్యలకు కూడా సంకేతాలు కావచ్చు. అందుకే, పసిపిల్లల్లో పైన పేర్కొన్న ఏ ఒక్క లక్షణం కనిపించినా వెంటనే అప్రమత్తమై నిపుణులైన వైద్యులను సంప్రదించడం ఎంతో ముఖ్యం. ప్రాథమిక దశలోనే వీటిని గుర్తించడం వల్ల తదుపరి ఇబ్బందులను నివారించవచ్చు. సమయానికి సరైన చికిత్స అందించకపోతే, ఈ చిన్నపాటి లక్షణాలు కాస్తా తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులకు దారితీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంటి చిట్కాలతో కాలయాపన చేయకుండా, శిశువు ఆరోగ్యం విషయంలో తక్షణ నిర్ణయాలు తీసుకోవాలి. ముఖ్యంగా చలికాలంలో లేదా వర్షాకాలంలో పసిపిల్లల శరీర వెచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారించాలి. సరైన సమయంలో వైద్య సహాయం అందడం వల్ల పసిపిల్లలను త్వరగా కోలుకునేలా చేయవచ్చు.

## రోహిత్‌ను వెనక్కి నెట్టి సూర్య టాప్‌కు.. కెప్టెన్సీలో టీమిండియా కెప్టెన్ వరల్డ్ రికార్డ్



**హైదరాబాద్ పెన్ పవర్:** సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలోని టీమిండియా టీ20 జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తుంది. రోహిత్ శర్మ తర్వాత భారత టీ20 పగ్గాలు చేపట్టిన సూర్య జట్టును సక్సెస్ ఫుల్ గా నడిపిస్తున్నాడు. ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా జట్టుకు విజయాలను అందిస్తున్నాడు. ఆడేది సొంతగడ్డపై అయినా.. విదేశీ గడ్డపై అయినా భారత టీ20 జట్టును ఓడించాలంటే ప్రపంచంలోని ఏ జట్టుకైనా శక్తికి మించిన పని.

రెండేళ్లుగా ఇండియా టీ20 ఫార్మాట్ లో తిరుగు లేని జట్టుగా నిలిచింది. ముఖ్యంగా సూర్య కుమార్ యాదవ్ సారధ్యంలో జట్టు ఓ రేంజ్ లో ఆడుతుంది. కెప్టెన్సీ చేపట్టినప్పటి నుంచి బ్యాటర్ గా విఫలమైన సూర్య నాయకత్వంతో జట్టుకు విజయాలను అందిస్తూనే ఉన్నాడు.

సూర్య కెప్టెన్సీలో ఇండియా ఆసియా కప్ గెలుచుకుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ను 2-1 తేడాతో జయభేరి మోగించింది. 2025 ఏడాది చివర్లో సౌతాఫ్రికాపై ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ ను 3-1 తేడాతో నెగ్గింది. ప్రస్తుతం న్యూజిలాండ్ తో జరుగుతున్న 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో ఇండియా రెండు మ్యాచ్ లు మిగిలి ఉండగానే 3-0 తో సిరీస్ కైవసం చేసుకుంది. ఆదివారం (జనవరి 25) కివీస్ తో జరిగిన మ్యాచ్ లో ఇండియా 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో సూర్య ఖాతాలో ఒక వరల్డ్ రికార్డ్ వచ్చి చేరింది. అంతర్జాతీయ టీ20 కెప్టెన్ గా తొలి 40 మ్యాచ్ ల్లో అత్యధిక మ్యాచ్ లు గెలిపించిన కెప్టెన్ గా సూర్య రికార్డ్ సృష్టించాడు. ఇండియా టీ20 కెప్టెన్ గా సూర్య 40 మ్యాచ్ ల్లో 32 విజయాలను అందించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ (31), ఆఫ్ఘనిస్తాన్ మాజీ కెప్టెన్ అస్గహార్ ఆఫ్ఘన్ (31) లను వెనక్కి నెట్టాడు. వరల్డ్ కప్ ముందు ఇండియాకు విజయాలను అందించడమే కాదు టాప్ ఇన్నింగ్స్ ఆడుతూ సూపర్ ఫామ్ లోకి వచ్చాడు. ఇటీవలే కివీస్ తో ముగిసిన మూడు టీ20 మ్యాచ్ ల్లో సూర్య బ్యాటింగ్ లోనూ చెలరేగాడు. మరి కెప్టెన్ గా సూర్య మరిన్ని రికార్డ్స్ బ్రేక్ చేస్తాడో చూడాలి.

## శాంసన్‌కు చెక్.. వరల్డ్ కప్‌లో టీమిండియా ఓపెనర్లుగా ఆ ఇద్దరూ ఫిక్స్

**2026 వరల్డ్ కప్ కు 10 రోజుల సమయం మాత్రమే ఉంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ నెలకొంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ ఇండియాలోనే జరుగుతుండడంతో డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా టైటిల్ నిలబెట్టుకుంటుందని ఫ్యాన్స్ ఎంతో ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. ఓ వైపు న్యూజిలాండ్ తో టీ20 సిరీస్ జరుగుండగానే మరోవైపు వరల్డ్ కప్ లో టీమిండియా ఓపెనర్లు ఎవరనే విషయంలో చర్చ సాగుతోంది. వరల్డ్ కప్ లో టీమిండియా ఓపెనర్లు ఎవరో ఇప్పుడు చూద్దాం..**



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ తో సిరీస్ ముందువరకు వరల్డ్ కప్ కు ఓపెనర్లు కన్ఫర్మ్ అయ్యారు. అభిషేక్ శర్మతో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ దిగడం ఖాయమనుకున్నారు. అయితే ప్రస్తుతం కివీస్ తో జరుగుతున్న టీ20 సిరీస్ చూస్తే శాంసన్ వరల్డ్ కప్ లో ఆడే అవకాశాలు కనిపించడం లేదు. శాంసన్ పేలవ ఫామ్ ఇందుకు కారణం. న్యూజిలాండ్ తో ఇప్పటివరకు జరిగిన మూడు టీ 20 మ్యాటిక్ ల సిరీస్ లో శాంసన్ ఘోరంగా విఫలమయ్యాడు. మూడు మ్యాచ్ ల్లో కలిపి 16 పరుగులే చేసి పూర్తిగా నిరాశపరిచాడు. మరోవైపు ఇషాన్ కిషాన్ మాత్రం తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నాడు. తొలి టీ20లో 8 పరుగులే చేసి విఫలమైనా రెండో టీ20 లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 32 బాల్స్‌లోనే 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 76 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఆదివారం (జనవరి 25) జరిగిన మూడో టీ20లోనూ 12 బంతుల్లోనే 28 పరుగులు చేయి జట్టుకు మెరుపు ఆరంభం ఇచ్చాడు. కిషాన్ దూకుడు చూస్తుంటే వరల్డ్ కప్ ప్లేయింగ్ 11లో స్థానం దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిలక్ వర్మ జట్టులోకి వస్తే కిషన్ లేదా శాంసన్ లలో ఒకరు తప్పుకోవాలి. దీని ప్రకారం ఫామ్ లో ఉన్న కిషాన్ ను అభిషేక్ శర్మతో ఓపెనింగ్ కు పంపొచ్చు.


## ప్లేయర్ అంటే ఇలా ఉండాలి: వెనక్కి డైవ్ చేస్తూ పాండ్య సూపర్ మ్యాన్ క్యాచ్..




**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ తో జరిగిన మూడో టీ20లో టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య తన ఫీల్డింగ్ విన్యాసాలతో ఆశ్చర్యపరిచాడు. ఆదివారం (జనవరి 25) గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ఒక స్టన్నింగ్ క్యాచ్ లో మైండ్ పోగొట్టాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ లోనే ఈ సీన్ చోటు చేసుకుంది. హర్షిత్ రానా వేసిన బంతిని కాన్వే మిడాఫ్ దిశగా ఆడాడు. టైమింగ్ మిస్ కావడంతో బంతి అక్కడే గాల్లో లేచింది. మిడాన్ లో ఫీల్డింగ్ చేస్తున్న పాండ్య వెనక వైపు నుంచి డైవ్ చేసి క్యాచ్ అందుకున్నాడు. హార్దిక్ పాండ్య పట్టిన క్యాచ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మ్యాచ్ లో తొలి ఓవర్ లో అద్భుతమైన క్యాచ్ అందుకున్న పాండ్య రెండో ఓవర్లో ఒక వికెట్ తీసుకున్నాడు. క్రికెట్ లో 3d ప్లేయర్ అంటే ఎలా ఉండాలో పాండ్య చూపించాడు. బ్యాటింగ్ లో అవకాశం వచ్చినప్పుడు దుమ్ములేపే పాండ్య బౌలింగ్ లోనూ రాణిస్తున్నాడు. ఈ రెండింటితో పాటు తన ఫీల్డింగ్ విన్యాసాలతో అబ్బురపరుస్తున్నాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే న్యూజిలాండ్ తో జరిగిన మూడో టీ20లో టీమిండియా విశ్వరూపం చూపించింది. ప్రత్యర్థి కివీస్ ను పసికూనగా మార్చేసి చిత్తుచిత్తుగా ఓడించారు. 154 పరుగుల టార్గెట్ ను కేవలం 10 ఓవర్లలో ఫినిష్ చేశారు. ఓపెనర్ అభిషేక్ శర్మ (20 బంతుల్లో 60: 7 ఫోర్లు, 5 సిక్సర్లు), కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (26 బంతుల్లోనే 57: 6 ఫోర్లు, 3 సిక్సర్లు) విశ్వ రూపం చూపించి కివీస్ కు ఘోరమైన పరాభవాన్ని మిగిల్చారు. ఆదివారం (జనవరి 25) గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో ముగిసిన ఈ మ్యాచ్ లో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. బౌలింగ్ లో బుమ్రా, బిష్ణోయ్ చెలరేగడంతో పాటు బ్యాటింగ్ లో అభిషేక్ చుక్కలు చూపించి మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. ఛేజింగ్ లో ఇండియా మూడు వికెట్లు కోల్పోయి 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. ఈ విజయంతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ను ఇండియా మరో రెండు మ్యాచ్ లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో సిరీస్ కైవసం చేసుకుంది.

# నిఖిల్.. ప్రతీసారి ఇలానే..







టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్ గ్రాఫ్ గమనిస్తే ఒక వింతైన, ఆసక్తికరమైన సెంటిమెంట్ కనిపిస్తుంది. సాధారణంగా సినిమా వాయిదా పడితే అంచనాలు తగ్గిపోతాయని, నెగిటివ్ బజ్ వస్తుందని అందరూ భయపడతారు. కానీ నిఖిల్ విషయంలో మాత్రం కథ పూర్తిగా రివర్స్. ఆయన సినిమా ఎప్పుడు లేట్ అయితే అప్పుడు అది బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ హిట్ గా నిలుస్తోంది. 'స్వామిరారా' సినిమా నుండి మొదలైన ఈ 'డిలే' సెంటిమెంట్ ఇప్పటికీ కంటిన్యూ అవుతుండటం విశేషం.

నిఖిల్ కెరీర్ ను మలుపు తిప్పిన 'స్వామిరారా' విడుదల కావడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంది. చాలా కాలం ల్యాబ్ లోనే ఉండిపోయిన ఆ సినిమా తీరా థియేటర్లకు వచ్చాక సంచలన విజయం సాధించింది. ఆ తర్వాత వచ్చిన 'కార్తికేయ', 'సూర్య వర్సెస్ సూర్య' చిత్రాలు కూడా అనుకున్న సమయానికి రాకుండా వాయిదా పడినా సరే, బాక్సాఫీస్ దగ్గర మాత్రం నిఖిల్ కు మంచి వసూళ్లు తెచ్చిపెట్టాయి. ఈ క్రమంలో నిఖిల్ సినిమాలు వాయిదా అనేది ఒక పాజిటివ్ సైన్ గా మారిపోయింది. ముఖ్యంగా 'అర్జున్ సురవరం' సినిమా పరిస్థితి చూస్తే ఈ సెంటిమెంట్ ఎంత స్ట్రాంగ్ గా ఉందో అర్థమవుతుంది. దాదాపు ఏడాదిన్నర కాలం వాయిదా పడుతూ వచ్చిన ఈ మూవీ, చివరికి థియేటర్లలోకి వచ్చి హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత పాన్ ఇండియా రేంజ్ లో హిట్ అయిన 'కార్తికేయ 2' కూడా అనేకసార్లు వాయిదా పడి రిలీజ్ అయ్యింది. ఫలితం ఏంటో మనందరికీ తెలిసిందే. అలాగే 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', '18 పేజెస్' కూడా ఇదే బాటలో నడిచి నిఖిల్ ఖాతాలో హిట్లుగా చేరాయి.ప్రస్తుతం నిఖిల్ తన 20వ చిత్రం 'స్వయంభూ'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా ఫిబ్రవరిలో రిలీజ్ కావాల్సి ఉన్నా, గ్రాఫిక్స్ పనుల కోసం ఏప్రిల్ 10కి వాయిదా పడింది. గ్రాండ్ విజువల్స్ కోసం మేకర్స్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు నిఖిల్ పాత సెంటిమెంట్‌ను గుర్తు చేస్తోంది. సినిమా లేట్ అయింది కాబట్టి ఈసారి కూడా పక్కా హిట్ కొట్టబోతున్నారనే చర్చ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో మొదలైంది.ఈ సెంటిమెంట్ వెనుక అసలు రహస్యం నిఖిల్ తీసుకునే జాగ్రత్తలే అని చెప్పాలి. సినిమా అవుట్‌పుట్ సంతృప్తికరంగా లేకపోతే ఆయన రిలీజ్ చేయడానికి అస్సలు ఒప్పుకోరు. క్వాలిటీ కోసం ఎంత కాలమైనా వెయిట్ చేయడం ఆయనకు అలవాటు. అందుకే లేట్ అయినా సరే, థియేటర్లో ఆడియన్స్ కు ఒక పర్ఫెక్ట్ సినిమా అందుతుంది. నేటి జనరేషన్ ఆడియన్స్ కూడా కంటెంట్ బాగుంటే సినిమా ఎప్పుడు వచ్చినా ఆదరిస్తారని నిఖిల్ సినిమాలు ప్రూవ్ చేస్తున్నాయి.సమ్మర్ కానుకగా ఏప్రిల్ 10న రాబోతున్న 'స్వయంభూ'పై భారీ అంచనాలు ఉన్నాయి. గ్రాఫిక్స్ కోసం తీసుకున్న ఈ ఎక్స్‌ట్రా టైమ్ సినిమాకు ఏ రేంజ్ లో హెల్ప్ అవుతుందో చూడాలి. నిఖిల్ తన కెరీర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో తీస్తున్న ఈ మూవీ, తన డిలే సెంటిమెంట్ ను కంటిన్యూ చేస్తూ మరోసారి రికార్డులు తిరగరాయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ వారియర్ కథ ఏప్రిల్ లో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965